ప్రజాశక్తి
ఆదివారం అనుబంధం
అక్టోబర్ 11, 2015

దర్శక దార్శనికుడు

సొరంగ మార్గాన...

అంతర్జాతీయంగా...
భారతీయ మెరుపులు

ప్రియాంక చోప్రా

దీపం వుండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలన్న సామెత విలువ సినీ, టీవీ తారలకు బాగా తెలుసు. అందుకే టీవీలో మాంచి డిమాండ్ వుండగానే సినీ పాత్రలు వెతుక్కోవడం... సినిమాల్లో హవా తగ్గగానే... టీవీల్లో అవకాశాలు అందుకోవడం చూస్తుంటాం. బాలీవుడ్ తారలూ తక్కువేం కాదు. ఈ పద్ధతినే కొద్దిగా అటూఇటుగా అనుకరిస్తూ... అంతర్జాతీయ టీవీల్లో మెరుస్తుంటారు. ఇర్ఫాన్‌ఖాన్, ప్రియాంక చోప్రా, షబానా అజ్మీ, సయీద్ జాఫ్రీ, అనిల్ కపూర్, నిమ్రత్ కౌర్, కబీర్‌బేదీ ... వారిలో ప్రముఖులు. అంతర్జాతీయంగా విస్తృతమైన గుర్తింపు పొందిన తొలి భారతీయ నటులలో కబీర్ బేదీ ఒకరు. ఇటాలియన్, అమెరికన్ సిరీస్ 'సాండోకన్', 'బోల్డ్ అండ్ బ్యూటిఫుల్'లో నటించి అంతర్జాతీయ గుర్తింపు పొందాడు. ప్రియాంక చోప్రా లాస్ ఏంజెల్స్ నుంచి న్యూయార్క్ వరకు సుపరిచితురాలు. ప్రస్తుతం 'క్వాంటికో' సిరీస్‌తో ప్రేక్షకులను కట్టిపడేస్తోంది. నటి, సామాజిక కార్యకర్త అయిన షబానా అజ్మీ మహిళా ప్రధాన పాత్రలకు పెట్టింది పేరు. బి.బి.సి రూపొందిస్తున్న టీవీ సిరీస్ 'క్యాపిటల్'తో అంతర్జాతీయ బుల్లి తెరపై కనిపించనుంది. ఎనిమిది పదులు దాటిన నటుడు సయీద్ జాఫ్రీ. బ్రిటీష్ నాటకాలు మొదలుకొని భారతీయ సినిమాల వరకు అన్నిట్లోను తనదైన ముద్ర వేశాడు. 'గ్యాంగ్‌స్టర్, ది జువెల్ ఇన్ ది క్రౌన్, తందూరి నైట్స్' వంటి బ్రిటీష్ టీవీ సిరీస్ లోనూ నటించాడు. అనిల్ కపూర్ 'స్లమ్ డాగ్ మిలియనీర్'తో విశ్వవ్యాప్త గుర్తింపు పొందినా... అమెరికన్ సిరీస్ '24' ద్వారా అక్కడి ప్రేక్షకులకు సుపరిచితుడైపోయాడు. 'లంచ్ బాక్స్'తో విదేశీ గుర్తింపు పొందిన నిమ్రత్ కౌర్ 'హోమ్ ల్యాండ్' ద్వారా విదేశీ బుల్లితెరకూ పరిచయమైంది. అవకాశం వచ్చినప్పుడు విదేశీ బుల్లితెరపై మెరిస్తే మంచిదే కదా! ●

కబీర్‌బేదీ

అనిల్ కపూర్


సయీద్ జాఫ్రీ

షబానా అజ్మీ

ఇర్ఫాన్‌ఖాన్

నిమ్రత్ కౌర్

ప్రజాశక్తి
snehaweekly.praja@gmail.com

పందికొక్కులు

'నేను రాను బిడ్డో మన వూరి దవాఖానకు...' అన్న పాట ఎనభైల్లో విపరీతంగా ఆకట్టుకున్న మాస్ పాట. ప్రభుత్వ ఆసుపత్రుల్లోని దుర్భర పరిస్థితులను ఇలా అలతి పదాలతో కళ్లకు కట్టాడో సినీ కవి. ఆశ్చర్యం! మూడు దశాబ్దాల తర్వాతా... అవే అస్తుబిస్తు భవనాలు, అరకొర వైద్యులు, మందులు, కానరాని పారిశుధ్యం.

వైద్యశాల అంటే పరిశుభ్రతకు ప్రతిరూపంలా వుండాలి. లోపలికి అడుగెట్టడంతోటే రోగికి సగం జబ్బు నయం కావాలి. అంతటి ప్రశాంత వాతావరణం వుండాలి. ఆవరణలోగాని, ఆస్పత్రిలోగాని ఎక్కడా రోగ కారకాలు కనిపించకూడదు. మన ప్రభుత్వాసుపత్రులు అలా వున్నాయా?!

ఓ వైపు ముక్కుతూ మూల్గుతూ లోపలికి వెళ్లే రోగులు. మరోవైపు మురుగు నీటి నిల్వలు. ఆ నీళ్లల్లో దోమలు, పందులు సకుటుంబ సపరివార సమేతంగా దినదినాభివృద్ధి చెందుతుంటాయి. ఆ పైన శునకాలు, మూషికాలు, సర్పాల సంగతి సరేసరి. ఇవికాక టన్నుల్లో పోగయ్యే వైద్య వ్యర్థాలు. ఇవన్నీ చూస్తుంటే... 'అవర్ గవర్నమెంట్ హాస్పిటల్స్ ఆర్ డస్టబిన్స్ ఆఫ్ సొసైటీ (మన ప్రభుత్వ ఆసుపత్రులు సమాజపు చెత్తకుండీలు) అన్న ఓ పెద్దాయన మాట గుర్తొస్తుంది. నిజమే కదా!

◆ మనలో మాట

ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని...భయంతో బిక్కుబిక్కుమంటూ ఆస్పత్రికొచ్చిన వారికి ఆహ్వానం పలికేది, బతుకుపై భరోసా కల్పించేది వైద్య సిబ్బంది కాదు. దోమలు, ఎలుకల బృందాలే. ఐసియుల్లో వున్నా ప్రశాంతంగా విశ్రాంతి తీసుకోడానికి వుండదు. ఎప్పుడు ఏ మూషికం ఏ కలుగులోంచి బయటికొస్తుందో... రోగి శరీరాన్ని ఎక్కడ ఏ భాగంలో చప్పరిస్తుందో తెలీక ... భయంతో బిగుసుకుపోవాల్సిందే. మూషికాల ముప్పేట దాడి చేశాక... ప్రాణాలు పోయాక...మంత్రులు, ఎమ్మెల్యేలు కంటి తుడుపు మాటలు, ఉత్తుత్తి సస్పెన్షన్లు చేస్తారు. కమిటీలు, రిపోర్టులు... అంతకుమించి ఎలాంటి మార్పు జరగదు. ప్రతిపక్షాలు, ప్రజాసంఘాలు ఎంత మొత్తుకున్నా చెవిటివాడి ముందు శంఖం ఊదిన చందమే.

ఎలుకల సమస్య అనేక అంశాలతో ముడి పడి వుంది. ఆస్పత్రి ఆవరణలో చెత్తా చెదారం, తినుబండారాలు- వైద్య వ్యర్థాలు పోగుబడడం వల్ల ఎలుకలు తయారౌతాయి. ఎలుకల కోసం పాములూ పోగవుతాయి. ఇన్ని సమస్యలకు ప్రధాన కారణం. ప్రభుత్వ అలసత్వమే. సర్కారీ దవాఖానాల్లో పనిచేసే వైద్యులు ప్రయివేటు ఆసస్పత్రులు పెట్టుకోవడానికి అనుమతిచ్చేదీ, వారికి ఏళ్ల తరబడి సెలవులిచ్చేదీ ప్రభుత్వమే. అక్కడి అవకతవకలను, అపరిశుభ్రతను, అవినీతిని చూసీ చూడనట్టు వదిలేసేదీ ప్రభుత్వమే. అవసరమైన మందులు, వైద్య పరీక్షలకు కావాల్సిన పరికరాలు లేకపోవడానికి, ఎలుకల పాలబడి పసిబిడ్డడు ప్రాణాలు కోల్పోవడానికి కారణం చిత్తశుద్ధి లోపించిన ప్రభుత్వమే. దాన్ని సరైన మార్గంలో పెట్టగలిగితే ... ఆస్పత్రుల్లో సమస్యలన్నీ వాటంతటవే పరిష్కారమౌతాయి.

■



టపా

బసవరాజు మాస్టారు

ముంబైలో 750 మంది రోగులకు రెండు పూటలా ఉచితంగా ఆహారం అందిస్తున్న సావ్లా ఆదర్శానికి కొలమానం లేదు. మహాత్ములుగా వేషం వేసి వారి చరిత్రలు బోధిస్తున్న బసవరాజు ఆలోచన అభినందనీయం. గండికోట రహస్యం నుంచి పలు చరిత్రాంశాలు తెలుసుకున్నాం. పునాదులు తవ్వకుండా కేవలం కొండ బండలపై కోట భారీ ప్రహరీ గోడలు నిర్మించడం విస్మయ పర్చింది. వెస్ట్రన్ ఘాట్ పరిరక్షణకు తీవ్రంగా కృషి చేస్తున్న పాండురంగ హేడ్గే కృషి మెచ్చుకోదగినది. బహుళ అంతస్తుల భవనాలపై డిజిటల్ ఫోటోగ్రఫీ చిత్రాలు కళ్ళు మిరుమిట్లు గొలిపాయి. పద్మనాభం చివరి మజిలీ తీరని దాహం వంటిది.

బత్తుల సత్యనారాణయ మూర్తి, మల్కాపురం, విశాఖపట్నం.

ముంబై జీవితాలు

ముంబై అనగానే గుర్తుకువచ్చే అంశం అక్కడి మురికి వాడల్లో నివసించే జనాలు, వారి జీవితాలు ఎంతో దుర్భరంగా, అగమ్యగోచరంగా ఉంటాయి. వారి జీవితాల ఆధారంగా సినిమాలు తీయడం నిజంగా అద్భుతం. ఆ చిత్రాలు ఇప్పటికి మన కళ్ళెదుటే కదలాడుతుంటాయి. క్యాన్సర్ రోగులను ఈ సమాజం ఎంత చిన్న చూపు చూస్తుందో మనకు తెలిసిన విషయమే. సావ్లా వారికి సేవ చేయడం చాలా గొప్ప విషయం ఇటువంటి వ్యాసాలు మరిన్ని ఇవ్వాలని కోరుకుంటున్నాం.

భవాని, గుంటూరు.

హాస్యానందం

పద్మనాభం పేరు తెలియని ఆంధ్రులు ఉండరు. అతని పేరు తలుచుకుంటే అతను నటించిన సినిమాలు కళ్ల ముందు కదలాడుతు ఉంటాయి. చివరి దశలో తను నమ్మిన వారే తనను మోసం చేయడం బాధకరమైన విషయం. ప్రతి వారం కొత్త కొత్త రుచులను అందిస్తున్నందుకు అభినందనలు. ఆలూతో ఆహా చాలా బాగుంది. ఫ్యాషన్ ప్రపంచానికి పెట్టింది పేరు ప్యారిస్ నగరం. ప్యారిస్ వీధుల్లో విజువల్ ఆర్ట్ కనువిందు చేసింది.

శ్రీను, గంగాయపల్లి, కమాలాపురం, కడప

గొప్ప ఆవిష్కరణలు

సైన్స్‌పై ఆసక్తి, అభిరుచి కలిగించేలా 'నేటి ఐన్‌స్టీన్లు' వ్యాసాలు రాయడం బాగుంది. వందల ఏళ్ల కాలం నాటి గొప్ప శాస్త్రవేత్తల గురించి పాఠ్య పుస్తకాల్లో చదువుతుంటాం కానీ నేటి కాలంలోనూ వారి స్థాయి శాస్త్రవేత్తలు ఎన్నో గొప్ప ఆవిష్కరణలు చేశారని తెలుసుకోవటం సంతోషంగా ఉంది. భావి తరానికి సజీవ స్ఫూర్తి ప్రదాతలు వీరు.

దేవా, నందలూరు, కడప

గండికోట చరిత్ర అద్భుతం

ఈ వారం గండికోట రహస్యం చాలా బాగుంది. ఒకే కొండ మీద కట్టడాలు కట్టడం నిజంగా అద్భుతం. చరిత్రది ఏముంది చెరిపితే పోతుంది అని అనుకుంటున్న కాలం ఇది. చెరిపితే చెరిగిపోయేది వాటి మీద ఉన్న దుమ్ము మాత్రమే చరిత్ర కాదు. మన పూర్వీకులు మనకు అందించిన గొప్ప వరం. కనుమరుగువుతున్న దశలో ఉన్న చరిత్రను పాలకులు తమకు ఎరగనట్టు వ్యవహరించడం బాధాకరమైన విషయం.

రాము, కడప.

సంచికపై మీ అభిప్రాయాలను పంపాల్సిన చిరునామా: స్నేహ, ప్రజాశక్తి, డోర్ నెం: 27-30-4, ఆకుల వారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ.-520002.
మెయిల్ అడ్రస్ : snehaweekly.praja@gmail.com

ఈ సంచికలో....

సొరంగ మార్గాన...

కవర్ స్టోరీ 6

తల్లి గర్భమంత భద్రంగా తోచేది కొండ గుహ తొలి మానవుడికి. దాన్ని విడిచి మైదానాలకు వలస పోయి ఎంతో పెద్ద వాడైపోయాడు. అయినా పేగు బంధంలాంటి సొరంగ బంధం తెగిపోలేదు. రవాణా మార్గంగా మారి కొత్త బంధాల్ని కలిపింది. అప్పుడు తలదాచుకుంటే, ఇప్పుడు రహదారిగా మారి అభివృద్ధికి అడ్డును తొలగించింది. వందల ఏళ్ల క్రితం నుంచి విస్తరించుకున్న సొరంగ రవాణా మార్గాలు (టన్నెల్స్) ఆధునిక మానవుడి పురోగతిలో ఓ గొప్ప మలుపు.

స్ఫూర్తి 3
దగ్గరితనపు సంతకం
వినూత్నం 4
'నీటి' చిట్కాలు
కార్టూన్ పంచ్ 5
ప్రత్యేకం 10
ఆ గ్రామం మతిమరుపున్న వారిదే..
నవ్వుల్ పువ్వుల్ 11
సినిమా కబుర్లు 14
దర్శక దార్శనికుడు
వింత లోకం 16
నడిచే ఎక్స్‌రే
కవిత్వమ్ 17
చనిపోయిన కవితో..
కథ 18
కుక్క చావు
రుచి 21
స్టీం దోశ
బాల నేస్తాలు 22
పిల్లి ఫీట్లు
కొత్త పుస్తకాలు 24
అక్కినేని సమగ్ర దర్శనం

చూద్దామా -12
హుర్రే..మహా మర్రి

అందమైన చేతిరాత ఉంటే ఓ రెండు మార్కులు ఎక్కువే పడతాయి. దాని కోసం కాపీ రైటర్లతో కుస్తీ పడే పిల్లలు ఎంతో మంది. చేతి రాత ప్రత్యేకత బడితో ఆగిపోలేదు. ఒకప్పుడేంటి ఇప్పటికీ లోగోల తయారీలో, అరుదైన ధ్రువపత్రాలు, స్క్రోల్స్‌లను అక్షరాలతోనే నగిషీలు చెక్కే అత్యంత అరుదైన కళ అది. కాలిగ్రఫీ, ఎన్‌గ్రోస్, హ్యాండ్ రైటింగ్‌లకు పెద్ద పీఠ వేసే పెన్‌మన్‌షిప్ అనే ఈ కళలో మిగిలుంది 11 మందే. వారిలో అతి పిన్న వయస్కుడిగా గుర్తింపు పొంది ఆ కళను భావితరాలకు తరలిస్తున్నాడు జేక్ వీడ్‌మన్.

దగ్గరితనపు సంతకం

కొలొరాడోలోని డెన్వర్‌కు చెందిన జేక్ వీడ్‌మన్‌కు ఇప్పుడు 28 ఏళ్లు. ఆయనకు పట్టుమని పదేళ్లు నిండకు ముందే ఆధునిక టెక్నాలజీ క్లాస్‌రూమ్‌ల్ని ఆక్రమించేసింది. చేతిరాతకు పని లేకుండా అన్ని కీస్ట్రోక్‌ల మీద నడిచేది. కానీ, జేక్‌ను ఈ కంప్యూటర్ గ్రాఫిక్ అక్షరాలు అంతగా ఆకట్టుకునేవి కాదు. అప్పుడప్పుడు తన బామ్మ నుంచి వచ్చే అందమైన చేతి రాతను నింపుకున్న ఉత్తరాలు, తన తల్లి గొలుసుకట్టు రాతతో నిండిన పుస్తకాలు ఇవే జేక్‌ను ముప్పిరిగొనేలా చేసేవి. అంత అందమైన అక్షరాలతో, వాక్యాల వరసలతో పేజీలకు ప్రామాణికత వచ్చేది. ఏదో తెలియని శోభ చేకూరేది. ఇక అప్పటి నుంచే జేక్ చేతిరాతలో గొప్ప కళాకారుడు కావాలని సంకల్పించాడు. పెన్ను కాగితం మీద పెడితే అదో అద్భుతాన్ని ఆవిష్కరించాల్సిందే. చివరకు హోమ్‌వర్క్, రఫ్ నోట్స్ ఏదైనా. పరీక్షలపుడు జేక్ జవాబు పత్రాలను దిద్దే అధ్యాపకులు తెగ సంబరపడి పోయేవారు. అద్భుత పెన్‌మాన్‌షిప్ కళ కనిపించే డిక్లరేషన్ ఆఫ్ ఇండిపెండెన్స్‌ను చేతులతో తడిమినట్టు అనుభూతి చెందేవారు. స్కూల్లోను, కళాశాలలోను మిత్రులు పట్టుబట్టి మరి జేక్‌తో టాట్టూలు, ఆహ్వాన పత్రాలు తయారు చేయించేవారు. ఆ ప్రోత్సాహమే జేక్‌ను మాస్టర్ పెన్‌మన్‌గా రూపుదిద్దుకునేలా చేసింది. ఓ స్టుడియోను ఏర్పాటుచేసుకున్న జేక్ చూపు తిప్పుకోనివ్వని వివాహ పత్రికలు, కమీషన్ వర్క్స్ చేసి చేతిరాత మీద సాగే పరిశోధన గ్రాఫాలజీకి ఆదాయం సమకూర్చుకునేవాడు. అసలీ కళ చరిత్ర, వైభవం తెలుసుకునేందుకు అంతర్జాలంలో శోధించిన జేక్‌కు చాలా విషయాలు తెలిశాయి.

స్వయం శోధన

1860–1930ల మధ్య ఈ కళకు స్వర్ణయుగం. అప్పట్లో ఫైన్ ఆర్ట్స్ కింద ప్రత్యేక విభాగంగా దీన్ని స్కూల్స్‌లో బోధించేవారు. ఎన్నో కళా సంస్థలు, ప్రభుత్వ శాఖలు, వ్యాపార కేంద్రాల్లో పెన్‌మాన్ కచ్చితంగా ఉండాల్సిందే. వారి అధికారిక ప్రకటనలు, ధ్రువపత్రాలు ప్రచార కార్యక్రమాలకు వీరి కలం కదలికే కీలకం. టైప్‌రైటర్ల ప్రవేశం సాధారణ కార్యకలాపాల్లో పెన్‌మాన్‌షిప్‌కు దెబ్బతగిలితే, కంప్యూటర్లు కళారంగంలోను ఆధిపత్యాన్ని ప్రదర్శించాయి. ఆ కాలంలో గొప్ప ఆర్టిస్ట్‌ల సృజనలను పరిశీలించి ఎన్నో మెళుకువలు నేర్చుకున్నాడు. తాను సొంతగా పెన్‌మాన్‌షిప్‌ను నేర్చుకున్నాడు. ఇలాంటి తరుణం లోనే జాన్ డీకోలిబస్‌కు చెందిన యూట్యూబ్ వీడియో కంటబడింది. బయట మార్కెట్‌లో దొరికే కలాలు ఉపయోగపడవని తెలుసుకున్నాడు. అరచేతిలో తేలిగ్గా ఇమిడిపోయి బొటన వేలు, చూపుడు వేలుకు మంచి పట్టును ఇచ్చే విధంగా కలాల్ని తానే సొంతంగా రూపకల్పన చేశాడు. జేక్ గురించి అంతర్జాతీయ చేతి రాత, పెన్‌మన్‌షిప్, ఎన్ గ్రోసింగ్ బోధనా సమాఖ్య ఐయామ్‌పీత్‌కు తెలియవచ్చింది.

ప్రత్యేక కలం

జేక్ రూపొందించిన కలాల్ని పరిశీలించిన వారు ఆశ్చర్యం వ్యక్తం చేయడంతో పాటు వందలాది కలాల్ని కళాకారులకు చేరవేశారు. 2010లో మాస్టర్ పెన్‌మన్ రిక్ మష్లర్ దగ్గర విద్యార్థిగా చేరి తర్వాతి ఏడాది కల్లా మాస్టర్ పెన్‌మాన్‌గా ధ్రువపత్రాన్ని అందుకున్నాడు. ఈ ధ్రువపత్రాన్నీ తానే స్వయంగా రూపొందించుకున్నాడు. వివిధ దేశాల అధ్యక్షులకు, పోప్‌కు, అంతర్జాతీయ సెలబ్రెటీలకు ప్రత్యేకమైన కళాఖండాల్ని సృజించి పేరు గడించాడు. కాగితం, తోలు, కలప, దంతం, కొమ్ములు, లోహం, రాతిపై తనదైన అక్షరాల పెయింటింగ్‌లను వేసే జేక్ ప్రతిభ ఇట్టే పసిగట్టాలంటే అతడు చేసే సంతకం చూస్తే చాలు. తన చేతి రాత చారిత్రాత్మకం అవుతుందని నమ్మే జేక్ జీవితం చాలా బ్యాలెన్స్‌డ్‌గా ఉండాలని చెబుతుంటాడు. ఓ ఔత్సాహిక చేతిరాత కళాకారుడి నుంచి మాస్టర్ పెన్‌మాన్ స్థాయిని అందుకునే కాలంలో అందరి కళాకారుల్లానే చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నాడు. కొన్ని రోజులు ఆకాశాన్ని తాకేలా చేస్తే కొన్ని రోజులు ఊబిలోకి జారిపోతున్న భావన కలిగించేవి. ఎన్నో ఒడిదుడుకుల్ని దాటుకుని ఓ పరిపూర్ణ చేతి రాత కళాకారుడిగా నిలదొక్కుకున్న జేక్‌కు కొలరాడోలోని రాకీ పర్వతాలే ప్రేరణ. లోతైన విశ్లేషణ, క్లిష్టమైన సృజనకు వాటిని చూస్తూనే ఆలోచనలో మునిగేవాడు. ఇప్పుడు మంచి గుర్తింపుతో పాటు ఆదాయాన్ని అందుకుంటున్నా ఆ ప్రాంతాన్ని విడిచివెళ్లనంటున్నాడు. రాకీ పర్వతాల్లో మనసు తప్పిపోయేందుకు వీలుగా తన స్టూడియోను రూపొందించుకున్నాడు. చేతి రాతలో మానవ ప్రత్యక్ష స్పర్శ, సంతకం ఉంటాయని కంప్యూటర్ గ్రాఫిక్స్‌లో ఈ దగ్గరితనం కనిపించదని అంటాడు.

నీటిని మోసే కష్టాలకు బ్రేక్‌లు వేస్తున్నాయి వినూత్న ఆలోచనలు. నిత్యం చూసే వస్తువులకు ఓ చిన్న మార్పు చేసి కొండంత భారాన్ని దించేస్తున్నారు. వాటర్ వీల్, పుల్లే బ్రేక్‌లు ఇలాంటివే. ఇవన్నీ సమాజంలోని సమస్యలకు స్పందించి తమ తెలివిని సద్వినియోగం చేసుకున్న బుర్రల్లో మొగ్గతొడిగినవే. చూడ్డానికి మామూలుగా కనిపించొచ్చు కానీ ఊహించనంత ప్రభావాన్ని చూపుతున్నాయి.

'నీటి' చిట్కాలు

నీటి కష్టాలు ఎంత ఘోరంగా ఉంటాయో రాజస్థాన్‌ను సందర్శిస్తే తెలుస్తుంది. పూటలకు పూటలు నడిచి వెళ్లే దూరంలో ఎక్కడో నీటి బావి ఉంటుంది. దాంట్లో ఎక్కడో అగాథంలో నీరు ఉంటుంది. ఏక బిగిన వాటిని తోడటం ఒక ఎత్తు అయితే ఇంటి వరకు మోసుకెళ్లడం మరో ఎత్తు. కేవలం ఇంటి అవసరాలకు నీటిని మోసేందుకే ఇద్దరు ముగ్గురు స్త్రీలను పెళ్లి పేరిట శాశ్వత బానిసలుగా చేసుకోవడం రాజస్థాన్‌లోని కొన్ని పల్లెల్లో పరిపాటి. నీటి కోసం వెళ్లే ఒంటరి మహిళలపై అఘాయిత్యాలు ఎక్కువే. నీటి వెతలు ఎంత తీవ్రంగా ఉంటాయో తెలియజెప్పటానికి ఈ ఒక్క విషయాలు చాలు. వెన్ను, మెడ సమస్యలతో సగం వయసుకే మూలన పడుతున్నారు. పాఠశాలలకు వెళ్లే వీలు చిక్కక నీటి చాకిరీకే పరిమితమౌతున్నారు. ఈ స్కూల్ డ్రాపౌట్లు, మహిళ ఆర్థిక స్వాలంబన, భద్రత, ఆరోగ్య సమస్యలకు పరిష్కారంగానే కొన్ని ఆవిష్కరణలు పల్లెల ముఖచిత్రాల్ని మార్చుతున్నాయి.

చేదకు బ్రేక్‌లు..

ఓ చిన్న టెక్నిక్ ద్వారా నీటిని మోసే భారాన్ని తగ్గించేశాడు అమృత్ అగ్రావత్ అనే పట్టాలేని టెక్నీషియన్. నీటిని చేదే బకెట్ తగిలించే పుల్లేకు బ్రేక్‌లను రూపొందించాడు. బరువు అనిపించగానే బ్రేక్ వేసుకుని ఎత్తున నీటి బకెట్‌ను నిలుపుకోవచ్చు. ఆ తర్వాత మళ్లీ తేలిగ్గా నీటిని తోడుకోవచ్చు. ఎక్కడో అగాథంలో ఉండే నీటిని ఒక్క చేదతో తోడే కష్టం తగ్గి సగం తోడాక కాసేపు బ్రేక్ వేసుకునే అవకాశముంది. పుల్లే బ్రేక్‌ల పనితీరును చాలా తేలిగ్గా అర్థం చేసుకుని ఉపయోగించొచ్చు. ఇది రాజస్థాన్ స్త్రీలకు వరమైంది. ఇప్పటి వరకు వేల సంఖ్యలో ఈ పుల్లే బ్రేక్‌లు అక్కడ వినియోగించబడుతున్నాయి. వ్యాపార కాంక్ష లేకుండా మిగతావారు వాటి నకళ్లు రూపొందించుకునే స్వేచ్ఛను ఇచ్చాడు. గ్రామానికి ఒకటి చొప్పున వీటిని అందించి వాటిని వినియోగించేలా ప్రోత్సహిస్తున్నాడు.

ఇంటికి తోలుకుంటూ..

నీళ్లయితే తోడారు. మరి వాటిని మైళ్ల దూరంలోని ఇళ్లకు ఎలా తీసుకువెళ్లటం? బిందె మీద బిందెల్ని మూడు నాలుగు వరసల్లో పెట్టి సమూహాలుగా కదిలే రాజస్థాన్ మహిళల వెతల్ని తీర్చేందుకు సింథియా కోయినింగ్ అనే మిచిగాన్ విశ్వవిద్యాలయ విద్యార్థి పరిష్కారం చూపింది. వాటర్ వీల్ పేరిట చాలా తేలికపాటి నీటి కేరియర్‌ను ఆవిష్కరించింది. స్థానిక సంస్థలతో కలిసి అతి తక్కువ ధరకు అందుబాటులో వచ్చేలా పైలట్ ప్రాజెక్ట్‌ను రాజస్థాన్‌లో చేపట్టింది. 20 గేలన్ల నీటిని నింపగలిగే పెద్ద ప్లాస్టిక్ బ్యారెల్‌ను రూపొందించింది. నీరు పట్టాక దానికి మూత బిగించి, హ్యాండిల్ తగిలించి చక్రంలా తిప్పుతూ తీసుకెళ్లేలా రూపకల్పన చేసింది. ఇది నీటి ట్రిప్పుల్ని తగ్గించడమే కాక వేగంగాను తీసుకువెళ్లే అవకాశం కల్పిస్తుంది. మధ్యమధ్యన కాసేపు విశ్రాంతి తీసుకోవచ్చు. మామూలుగా బిందెలు, కుండలతో అయితే నెత్తి మీద భారాన్ని దింపి మళ్లీ తలపైకి పెట్టుకోవడానికి మరొకరి సాయం కావాలి. కానీ దీన్ని చక్కగా పక్కన నిలిపేయొచ్చు. నలుగురి అవసరాలకు సరిపడా నీటిని ఒకే ట్రిప్పులో తీసుకెళ్లవచ్చు.

✦







కార్టూన్ పంచ్

తల్లి గర్భమంత భద్రంగా తోచేది కొండ గుహ తొలి మానవుడికి. దాన్ని విడిచి మైదానాలకు వలస పోయి ఎంతో పెద్ద వాడైపోయాడు. అయినా పేగు బంధంలాంటి సొరంగ బంధం తెగిపోలేదు. రవాణా మార్గంగా మారి కొత్త బంధాల్ని కలిపింది. అప్పుడు తలదాచుకుంటే, ఇప్పుడు రహదారిగా మారి అభివృద్ధికి అడ్డును తొలగించింది. వందల ఏళ్ల క్రితం నుంచి విస్తరించుకున్న సొరంగ రవాణా మార్గాలు (టన్నెల్స్) ఆధునిక మానవుడి పురోగతిలో ఓ గొప్ప మలుపు.

అరకు టన్నెల్

సొరంగ మార్గానం

అజయ్ కుమార్ వారాల
-9502395077

కొండ గుహల్లో, సొరంగాల్లో గొప్ప పట్టణాలు వర్ధిల్లాయి. టర్కీ లాంటి పర్వత ప్రాంతాల్లో జీవనానికి అవే ఆయువు పోశాయి. వేల ఏళ్ల ఘన కీర్తిని సొంతం చేసుకున్నాయి. ఆ తర్వాత కందకాలు, గనుల రూపంలో అవే సొరంగాలు మనిషిని రాతి యుగం నుంచి ఆధునిక యుగానికి మరలే సొత్తుగా మారాయి. పిట్టలు చెట్లపై గూళ్లు కట్టుకున్నట్టు మనిషి కొండల్లో గుహలు తొలచి తలదాచుకున్న రోజులు ఎప్పుడో పోయాయి. భూమంతా విస్తరించిన మానవ సముదాయాలు ఆకాశానికి అంటే అద్భుతహర్మ్యాల్ని ఏర్పాటు చేసుకున్నాయి. సముద్రానికి విస్తరించి కృత్రిమ దీవుల్ని (దుబాయ్ పామ్ ద్వీపాలు) కట్టుకున్నాయి. ఏకంగా అంతరిక్షంలోనే తేలియాడే గూడు (అంతరిక్ష కేంద్రం)ను నెలకొల్పాయి. కానీ, నేలపై పరుగుకి అనేక ఆటంకాలు అడ్డుపడ్డాయి. అవి గోడలు కాదు కూల్చేసి సాగిపోవడానికి. వేల అడుగుల ఎత్తులో వందల శ్రేణిలో అంతెత్తున్న ఎదురు నిలిచిన పర్వతాలు. వాటి ప్రమాదపు అంచుల్లో, విశృంఖల లోయల్లో మనిషికి దోవ కరువైంది. పక్క సమూహానికి కలిపే దారి తప్పింది. దానికి పరిష్కారంగానే టన్నెల్స్‌ను రవాణా మార్గాలుగా అభివృద్ధి చేసుకుంది మానవ జాతి. నీటిపారుదల, గనులకే కాక తొలి రవాణా మార్గంగా టన్నెల్‌ను తొలిచింది నాలుగు వేల ఏళ్ల క్రితమే. బాబిలోనియాలో ఇటుకల కట్టుబడితో సాగిన 900 మీటర్ల నడకదారే తొలి సొరంగ రవాణా మార్గం. క్రీస్తు పూర్వం 2180–2160 మధ్య నిర్మించిన ఈ టన్నెల్ యూఫ్రెట్స్ నది కిందుగా వేసి రాజభవనాన్ని ఆలయాన్ని అనుసంధానించారు. గ్రీకులు, రోమన్లు, భారత్, చైనా నిపుణులు వేల ఏళ్ల క్రితమే ఈ ప్రత్యేక రవాణా మార్గాలను తొలిచారు. ఎప్పుడో రాజుల కాలంలో రహస్య మార్గాలుగా ఉపద్రవాల్ని అడ్డు తొలగించిన ఇవే టన్నెల్స్ సాంకేతికత వేగవంతమైన ప్రయాణానికి దారి వేసింది. చిన్న చిన్న దీవుల సముదాయంగా, ఒక తీరుగా లేని నైసర్గికతతో ఒక్క గాడిన నడిచే బాట లేని జపాన్ లాంటి దేశానికి వెన్నెముక అక్కడ ఆరు వేలకు పైగా ఏర్పాటు చేసుకున్న సొరంగ మార్గాలే. అడుగడుగునా అడ్డు తగులుతూ, పొంతన లేని మలుపులతో ప్రయాణాన్ని ఆలస్యం చేసే కొండల్ని తొలచి, సముద్రం అడుగు నుంచి చొచ్చుకుపోయి వేసుకున్న ఆ టన్నెల్సే జపాన్ అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నాయి. ఆస్ట్రియా, అమెరికా, చైనా, భారత్ లాంటి చోట్ల దారికి అడ్డుతగిలే దుర్గమ కనుమలు, పర్వత ప్రాంతాల్లో ఒక ఊరిని

మరొక ఊరితో కలిపే ఈ దారులు సుదూరాలకు పరుచుకుంటూ పోయాయి. కేవలం విలక్షణ నైసర్గిక ప్రాంతాలనే కాదు. అప్పటికే మహా నగరాలు ఏర్పాటు కాబడి దారి వేసే దోవ లేక సతమతమయ్యే సిటీ ప్లానింగ్ అధికారులకూ ఇవే దారి తెన్ను చేకూర్చాయి. వంతెనలు కట్టే అవకాశం లేని చోట సైతం సొరంగం తొలిచే వెసులుబాటును ఆధునిక సాంకేతికత అందించింది. 2016లో ఆవిష్కారం కానున్న టన్నెల్ వండర్ ఆల్ఫ్ ట్రాన్సిట్ రవాణా వ్యవస్థలో ప్రత్యేక అధ్యాయాన్ని గ్రంథీకరించుకోనుంది. స్విజర్లాండ్‌లోని ఎర్ట్స్‌ఫెల్డ్(యూరి)ని బోడియో(టిసినో)లను అనుసంధానించనున్న ఈ మార్గం ఆల్ప్స్ పర్వత శ్రేణి కిందుగా వేయడం ఓ ఇంజినీరింగ్ మార్వెల్. 1996లో ప్రారంభమైన దీని పనులు పూర్తి కావచ్చాయి. వచ్చే ఏడాది జూన్ 5న ప్రారంభానికి ముస్తాబు అవుతోంది. 57 కిలోమీటర్ల ఈ టన్నెల్ పూర్తి అయితే ఇదే ప్రపంచంలో అతి పొడవాటి సొరంగ మార్గంగా గుర్తింపు తెచ్చుకుంటుంది. గంటకు 250 కిలోమీటర్ల వేగంతో వెళ్లే రైళ్లు రెండు సింగిల్ ట్రాకుల గుండా పరుగెట్టనున్నాయి.

కొండను తొలుస్తున్న దృశ్యం

నగర నాడులు

అమెరికాలోని ప్రతి నగరానికి ఓ సబ్‌వే ఉంటుంది. ఎక్స్‌ప్రెస్ వేలకు కలిపే ఎన్నో టన్నెల్స్ అక్కడ ట్రాఫిక్‌ను స్వేచ్ఛగా కదిలేలా వెసులుబాటును అందించాయి. ఆకాశహర్మ్యాలతో నిండిపోయిన ఎన్నో నగరాల్లో ఫ్లై ఓవర్లు, వంతెనలు చూపని పరిష్కారాన్ని టన్నెల్స్ చూపించాయి. కాలిఫోర్నియా, మన్‌హట్టన్, న్యూయార్క్, వాషింగ్టన్ డీసీ తదితర ప్రధాన నగరాలన్నింటికీ సొరంగ మార్గాలున్నాయి. చైనా, భారత్ వంటి అతి పెద్ద జనాభా కలిగిన దేశాల రవాణా సమస్యకు టన్నెల్స్ మంచి పరిష్కారాల్నే చూపుతు న్నాయి. భౌగోళికంగా అస్తవ్యస్తంగా ఉండే ఈ దేశాల్లోని ప్రధాన నగరాలన్ని ఒక దానికొకటి చాలా దూరాల్లో ఉంటాయి. వాటిని మిగతా ప్రాంతాలతో అనుసంధానిస్తేనే సమూలాభివృద్ధి సాధ్యం.

వంతెనల బదులు

మంచు, ఎడారి, పర్వత, కనుమలతో దుర్భేద్యంగా కనిపించే ప్రాంతాలలోకి చొచ్చుకుపోవాలంటే సుగమమైన మార్గాలుండాలి. వంతెనలతో అనుసంధానించే భౌగోళిక పరిస్థితులు లేని ఇటువంటి చోట్ల టన్నెల్సే శరణ్యం. వంతెనల్ని కట్టడానికి భారీ స్థాయిలో ఫుట్ ప్రింట్స్ స్థలం అవసరమవుతుంది. చోటు లేక ఇరుకైన నగరాల్లో భూమి ధరల్ని దృష్టిలో పెట్టుకుని ఉపరితల ప్రాంతాన్ని మరో అభివృద్ధి ప్రాజెక్టుకు సద్వినియోగం చేసుకునే వెసులు బాటును సొరంగ రవాణా మార్గాలు కలిగిస్తాయి. మన్‌హట్టన్, హాంకాంగ్, ముంబై లాంటి నగరాల్లో గజం భూమి కూడా చాలా విలువైనది. ఇలాంటి మహా నగరాల్లో టన్నెల్స్ నెట్‌వర్క్ విస్తరణకు అక్కడి ప్రభుత్వాలు మొగ్గు చూపుతున్నాయి. అప్పటికే రెండు మూడు అంచెల్లో విస్తరించిన ఫ్లై ఓవర్లకు తోడుగా ఈ టన్నెల్ నెట్‌వర్క్‌లు ట్రాఫిక్‌ను సడలించేందుకు గొప్ప ప్రత్యామ్నాయాలు. ట్రాఫిక్ సామర్థ్యాన్ని గణనీయంగా పెంచడమే కాక దాన్ని పైకి కనపించకుండా గందరగోళం లేకుండా చేస్తాయి. వారసత్వ కట్టడాలు, సుందర ప్రాంతాలు, పర్యాటక ప్రదేశాల్ని దెబ్బతీయకుండా వాటి కిందుగా మార్గాలు వేస్తున్నారు. బోస్టన్‌లోని బిగ్ డిగ్ టన్నెల్ ఈ కోవకు చెందినదే. భారీ స్థాయిలో ఉపరితల ప్రదేశాన్ని ఈ టన్నెల్ ద్వారా మిగుల్చుకోగలిగారు. యుద్ధం, వాణిజ్యం తదితర వ్యూహాత్మక అంశాలను లెక్కలోకి తీసుకుని సముద్రంపై వంతెన బదులు సముద్ర గర్భం గుండా వేసిన టన్నెల్స్ కూడా చాలానే ఉన్నాయి. వాటిలో ముఖ్యమైంది వర్జీనియాలోని హాంప్టన్ రోడ్స్. అమెరికా నౌకాదళానికి చెందిన భారీ యుద్ధ నౌకలు స్వేచ్ఛగా తిరగడానికి ఈ తరహా టన్నెల్ రవాణా మార్గాన్నే పౌరుల కోసం రూపొందించారు. ఇలా సముద్రం గుండా వేసిన టన్నెల్స్‌లో రెండు దేశాల్ని కలిపేవి కూడా ఉన్నాయి. డెన్మార్క్ స్వీడన్‌లను కలుపుతూ చెసాపీకె బే బ్రిడ్జి–టన్నెల్‌ను నిర్మించారు. ఇది పాక్షికంగా వంతెన, పాక్షికంగా సొరంగం. ఈ మార్గంలో ప్రయాణిస్తే ఒక్కసారిగా సముద్రంపై వంతెన మీద నుంచి వెళ్లే వాహనాలు బ్రిడ్జి తెగిపోయి సముద్రంలోకి జారిపోతున్న భావన కలుగుతుంది. దీని శాటిలైట్ ఇమేజెస్ ఎలా ఉంటాయంటే రెండు వంతెనలను సముద్రం మింగేసినట్టు కనిపిస్తాయి. సముద్ర టన్నెల్ విషయంలో నిర్మాణం బ్రిడ్జి పనుల కన్నా తేలిగ్గా ఉంటుంది. ఆటుపోటులు, సముద్రగాలులు, ప్రవాహాలు వంటి వాతావరణ అననుకూలతలతో పాటు తయారీ విధానం వంతెనతో పోలిస్తే సొరంగాలే తేలిగ్గా ఉంటాయని ఇప్పుడు ఎక్కువగా ఆ తరహా మార్గాలకే ఆసక్తి చూపుతున్నారు. షిప్‌యార్డ్‌లో టన్నెల్ విడిభాగాల్ని రూపొందించుకుని వాటిని నౌక ద్వారా తీసుకువెళ్లి సముద్రంలో జారవిడిచి అక్కడే ఒకదానితో ఒకటి అతికిస్తారు. ఆ తర్వాత సముద్ర నీటి పీడనానికి, భారానికి తట్టుకునేలా ఎయిర్ కంప్రెషన్ చేస్తూనే నీటిని తోడేస్తారు. మరీ తీర ప్రాంతాల్లోనైతే సముద్రం రాతి గట్టిదనాన్ని బట్టి నీటి కింది రాతిని తొలచి కొంత మార్గాన్ని వేస్తున్నారు. భూకంపాల సమయంలోను వంతెనల కన్నా టన్నెల్స్‌పైనే

బిగ్‌వండర్

అమెరికా చరిత్రలోనే అత్యంత ఖరీదైన సాహసవంతమైన టన్నెల్ ప్రాజెక్ట్ బిగ్ డిగ్. బోస్టన్‌లో హైవే కిందుగా, ముఖ్యంగా భారీ ఆకాశహర్మ్యాల పునాదుల పక్కగా 8 లైన్లలో మూడున్నర మైళ్ల పొడవున వేసిన సొరంగ రోడ్డు మార్గాలు ఇంజినీర్ల నైపుణ్యానికి పరాకాష్ట. 2004నాటికి ప్రారంభమైన ఈ మార్గం బోస్టన్ నగరానికి చెప్పలేనంత మేలు చేకూర్చింది. కోటిన్నర ఘనపు గజాల మట్టిని తవ్వితీశారు. ఐదున్నర లక్షల ట్రక్కుల లోడ్‌లకు సమానమైన ఆ మట్టితో ఓ భారీ ఫుట్‌బాల్ స్టేడియాన్ని నింపేయొచ్చు. దీనికి ఉపయోగించిన స్టీలును ఒక్క అంగుళం వెడల్పున తీగలా చేసి భూమధ్య రేఖను చుట్టివేయొచ్చు. ప్రపంచంలోని అతి వెడల్పాటి కేబుల్ స్టేయిడ్ వంతెన అయిన ది చార్లెస్ రివర్ బ్రిడ్జి వద్ద నదిని క్రాస్ చేస్తూ పోవడం మరో వింత.

ప్రభావం తక్కువ అని పరిశీలనలో తేలింది.

తీరుకో పద్ధతి

ఏవైనా పర్వతాలు, కొండల గుండా సొరంగ మార్గాలు తవ్వాలంటే అనేక విషయాల్ని పరిగణనలోనికి తీసుకుంటారు. రాతి, మృత్తిక స్వభావాల్ని పరిశీలిస్తారు. వాటి క్రమతీరు కూడా నిర్మాణ పద్ధతులను ఎంచుకోవడంలో కీలకం. జియోటెక్నికల్ ఇన్వెస్టిగేషన్‌లో ముఖ్యంగా రాతి, మృత్తిక 13 అంశాల్ని ఆధారంగా చేసుకుని వర్గీకరిస్తారు. ఎత్తు, వాలు, నివాస ప్రాంతాలు, నైసర్గిక స్వరూపం వంటి అనేక విషయాల్ని కూడా పరిగణనలోకి తీసుకుని పలు పద్ధతుల్లో సొరంగ మార్గాల వేస్తారు. భవిష్యత్తులో టన్నెల్ మీద పెరిగే భారం, టన్నెల్ పొడవు, వ్యాసార్థాలు కూడా ఎంపికలో చాలా ముఖ్యమైనవి. అత్యున్నతి ప్రాంతాల్లో డ్రిల్ అండ్ బ్లాస్ట్ పద్ధతిని కానీ, టన్నెల్ బోరింగ్ మెషీన్‌ను ఉపయోగించి గానీ లేదా ఆస్ట్రియన్ పద్ధతిలో గానీ సొరంగాల్ని తవ్వుతారు. ఐసెన్‌హోవర్ మెమోరియల్ టన్నెల్ ఆ తరహాలో నిర్మించినదే. నీటి గుండా అయితే ఇమ్మెర్సడ్ సంకెన్ ట్యూబ్ పద్ధతిని పాటిస్తారు. దీనికి హాంప్టన్ రోడ్స్ టన్నెల్ మంచి ఉదాహరణ. అయితే ఫ్రాన్స్, ఇంగ్లండ్‌లను కలుపుతూ వేసిన చన్నెల్ టెన్నల్‌ను మాత్రం టన్నెల్ బోరింగ్ మెషీన్‌ను ఉపయోగించే వేశారు. సరైన మార్గంలో, ప్రాంతంలో, కొలతల్లో తవ్వకం సాగుతుందా లేదా అనే విషయాన్ని నిర్ధారించేందుకు ఇప్పుడు జీపీఎస్‌ను కూడా వాడుతున్నారు. జియోడిమీటర్ లేదా టెల్యూరోమీటర్ వంటి అధునాతన ఎలక్ట్రానిక్ పరికరాలతో దూరాల్ని అతి కచ్చితత్వంతో కొలతలు తీసుకుంటున్నారు. రోడ్డు, రైల్వే మార్గాలను వేస్తూనే డ్రైనేజీ వ్యవస్థ, లైనింగ్, విద్యుత్, గాలి, సిగ్నల్, కమ్యూనికేషన్, అగ్ని నిరోధక, మాపక వ్యవస్థల్ని కూడా ఏర్పాటు చేస్తారు. ప్రమాదాలు జరిగితే లోపలి వారు తప్పించుకునేందుకు అత్యవసర దారి ఏర్పాట్లు ఉంటాయి. భూ సొరంగ మార్గాల్లో అయితే ఇగ్రెస్ మెట్ల దారి రూపంలో, జలాంతర్భాగాల్లో అయితే ప్రత్యేక అనుసంధాన దారులు ఉంటాయి. వీటిని తెలిగ్గా గుర్తించే విధంగా సైన్ బోర్డులు ఉంటాయి. అన్నింటి కంటే ప్రమాదకర అంశమేమిటంటే ఎక్కువ దూరం వేసిన సొరంగాల్లోని వాతావరణం. బయటి వాతావరణానికి లోపలి వాతావరణానికి సమతుల్యం ఉండేలా వెంటిలేషన్ వ్యవస్థను రూపొందిస్తారు. రైల్వే మార్గాల్లో అయితే నిర్ణీత కాల పరిమితిలో, రోడ్డు మార్గాల్లో అయితే నిరంతరం వాతావరణాన్ని పర్యవేక్షిస్తూనే ఉంటారు. ఇప్పుడు రియల్ టైమ్ ట్రాఫిక్ అలెర్ట్స్‌తో పాటు సీసీ కెమెరాల ద్వారా ఎప్పటికప్పుడు లోపలి పరిస్థితుల్ని పర్యవేక్షిస్తూ చోదకులకు సమాచారాన్ని చేరవేస్తున్నారు. ఒకప్పుడు ఏదైనా అవాంతరం వల్ల లోపల ట్రాఫిక్ జామ్ అయిందంటే పెద్ద ప్రమాదానికి కారణమయ్యేది. 1944లో ఇటలీలోని ఆర్మీ సొరంగ మార్గంలో జరిగిన బెల్వానో రైలు ప్రమాదంలో 426 మంది మరణానికి కారణం లోపలి వాతావరణమే. గంట సేపు సొరంగంలో రైలు నిలిచిపోవడంతో ఊపిరాడక ప్రయాణికులు ప్రాణాలు విడిచారు. ఇదే అతిపెద్ద సొరంగ మార్గ ప్రమాదం. ఆ తర్వాత సొరంగ మార్గ నిర్మాణాలు, వాడుకలో అనేక నిబంధనలు, మార్పులు చోటుచేసుకుని ఇప్పుడు ప్రయాణాన్ని చాలా సురక్షితం చేశాయి. ఇప్పుడు చూస్తున్న ప్రత్యేక వెంటిలేషన్ వ్యవస్థలు, ఎమర్జెన్సీ ఎవాక్యుయేషన్ ప్లాన్లకు అదే కారణమైంది. నిర్మాణ సమయంలో ప్రాణనష్టం బయటి మార్గాలతో పోల్చితే సొరంగ మార్గాల్లోనే అధికం. దాదాపు రెండు రెట్ల అధిక ప్రాణనష్టం సంభవించే అవకాశం ఉందని లెక్కలు. దీనిని దృష్టిలో పెట్టుకునే కార్మికుల భద్రత, నష్టనివారణ అంశానికి అధిక ప్రాధాన్యత పెరిగింది. కచ్చితమైన వర్క్ కోడ్స్‌ను పాటించడం తప్పనిసరి చేశారు. ముందుగా ఇన్–సైటు ప్రయోగ పనులు చేసిగానీ పూర్తిస్థాయి తవ్వకాలకు సిద్ధం కావడంలేదు. సబ్‌వే ఎన్విరాన్‌మెంట్ సిమ్యులేషన్ వంటి కంప్యూటర్ ప్రోగ్రామ్‌ల ద్వారా సొరంగాల్లోని లోపలి పరిస్థితుల్ని కళ్లకు కట్టేలా వివరించే ప్రయత్నం చేస్తున్నారు.

టీబీఎం రైలు లాంటిదే..

ఇప్పుడు చాలా వేగవంతంగా సొరంగ

చానెల్‌టన్నెల్

ఫ్రాన్స్‌లోని సాంగట్టె నుంచి ఇంగ్లండ్‌లోని ఫోక్‌స్టోన్ వరకు వేసిన ఈ సొరంగ రైల్వే మార్గం ఇంగ్లీష్ చానెల్ కిందుగా 32 మైళ్ల పొడవున వెళు తుంది. ప్రపంచ పొడవాటి జలాంతర్భాగ సొరంగ మార్గాల్లో ఒకటైన దీన్ని యూరో టన్నెల్‌గా కూడా పిలుస్తారు. నిజానికి మూడు టన్నెల్‌లా వ్యవస్థ ఇది. వచ్చి పోయే రైళ్లకు చెరో మార్గం వాటి మధ్యన అత్యవసర మార్గంతో దీన్ని ఏర్పాటు చేశారు. సముద్రం అడుగున టన్నెల్ మధ్యన ఏదైనా ప్రమాదం సంభవిస్తే తప్పించుకుపోయేలా దీన్ని రూపొందించారు. ఇంత సుదూర టన్నెల్‌లో ఒక ట్రాక్ నుంచి మరో ట్రాక్‌కు రైలు మారేందుకు క్రాసోవర్‌లను కూడా ఏర్పాటు చేయడం మరో అద్భుతం. దీన్ని కేవలం 3 ఏళ్లలో పూర్తిచేయడం ఆశ్చర్యకరం. వంద మైళ్ల వేగంతో రైళ్లు ఎటువంటి ఇబ్బంది లేకుండా కేవలం 20 నిమిషాల్లో టన్నెల్‌ను దాటేస్తాయి. ఇరు దేశాల ఇంజినీర్లు పోటీ పడీ మరీ సొరంగాన్ని వేసుకుంటూ పోయి ఓ చోటున అనుసంధాన మయ్యారు. 1991లో పూర్తిగా అందుబాటులోకి వచ్చిన ఈ మార్గం తొలి ఐదేళ్లల్లోనే 2 కోట్ల 80 లక్షల మంది ప్రయాణీకులను కోటి ఇరవై లక్షల టన్నుల సరుకు రవాణా సాగింది. ఇదో రికార్డు.

ట్యూబ్‌ల్లో లండన్

ప్రపంచంలోనే అతి పురాతన టన్నెల్ రైల్వే మార్గంగా చరిత్రకెక్కింది లండన్ అండర్ గ్రౌండ్ వ్యవస్థ. దీన్నే ట్యూబ్‌గా పిలుస్తారు. 1863 జనవరి 10న తొలి మార్గం పడగా అది 402 కిలోమీటర్లకు విస్తరించుకుంటూ మొత్తం లండన్ నగరంతో పాటు బకింగ్‌హామ్‌షైర్, హెంట్‌ఫోర్డ్‌షైర్, ఎస్సెక్స్‌లను అనుసంధానం చేసింది. 11 రైలు మార్గాలు, 270 సబ్‌వే స్టేషన్లతో ఇది అతిపెద్ద రవాణా నెట్‌వర్క్‌గా రికార్డుకెక్కింది. కొన్ని లక్షల మంది లండన్ వాసుల దినచర్య ట్యూబ్‌లతోనే మొదలై పూర్తవుతుంది. కిక్కిరిసిపోయే స్టేషన్లకు వెంటిలేషన్ అందించడం ఒక ఎత్తు అయితే చిన్న ప్రమాదం కూడా జరగకుండా ఎప్పటికి అప్పుడు పర్యవేక్షణ చేయడం మరో ఎత్తు. కాంటాక్ట్ అవసరం లేని ఆయిస్టర్ టికెటింగ్ వ్యవస్థ ఇక్కడ హైలెట్.




జల సొరంగం


ఘూట్‌కీ గుని టన్నెల్, రాజస్తాన్

సైకాన్ టన్నెల్

జపాన్లోని హొన్షు, హొక్కైడోలను కలుపుతూ వేసిన టన్నెల్ రైల్వే వ్యవస్థ ప్రపంచంలోనే అతి పొడవాటిది. 33 మైళ్లపాటు సాగే ఈ మార్గం నిర్మాణానికి ఓ పెద్ద రవాణా ప్రమాదం కారణం. 1954లో వచ్చిన ఓ టైఫూన్ వల్ల ట్సుగారు జలసంధిలో 5 ఫెర్రీ పడవలు సముద్రంలో మునిగి సుమారు 1430 మంది చనిపోయారు. నిత్యం తుఫాన్లతో సతమతమయ్యే జపాన్‌లో ప్రత్యామ్నాయ మార్గం కోసం అన్వేషించి టన్నెల్ వ్యవస్థను రూపుదిద్దారు. 1988లో ప్రారంభమైన ఈ సొరంగ రైలు మార్గం జలసంధి కిందుగా వెళుతుంది. సముద్ర ఉపరితలానికి 787 అడుగుల కిందట ఈ టన్నెల్ ఉంటుంది.

మార్గాల్ని తవ్వడానికి టీబీఎంలనే వాడుతున్నారు. దీని పనితీరు చాలా ఆసక్తికరంగా ఉంటుంది. టన్నెల్ వ్యాసం తదితర కొలతలకి తగ్గట్టు మెషీన్‌ను సరిచేసి తవ్వడం ప్రారంభిస్తారు. వందల టన్నుల బరువుండే ఈ మెషీన్ ముందు పలకపై అనేక తిరిగే బ్లేడ్‌లు ఉంటాయి. అవి రాతిని తొలగించినపుడు రాలిపడే వ్యర్థాల్ని వాటి గుండా వెనుక ఉండే తొట్టెలోకి నెట్టివేయబడతాయి. మెషీన్‌కు అనుసంధానంగా ఉండే ఓ కన్వేయర్ బెల్టు వ్యర్థాల్ని బయటకు తరలించే ప్రధాన కన్వేయర్ బెల్టుపై జారవిడుస్తాయి. అలా తక్కువ మంది కార్మికుల పర్యవేక్షణతో తేలిగ్గా వ్యర్థాలన్నీ బయటపడేస్తారు. ఓ పక్క ప్రధాన మిషన్ కొండను తొలుస్తూ వెళుతుంటే దాని వెనుకే ఉన్న మిగతా ట్రైన్ భాగాల్లో గోడల్ని పటిష్ట పరిచే పనులు చకచకా జరిగిపోతుంటాయి. మెషీన్ వెనుకే కాంక్రీట్, స్టీల్ లైనింగ్‌లు తయారుచేసి గోడలకు బిగుస్తూ వెళుతుంటారు. ఇలా చాలా వేగవంతంగా తేలిగ్గా సొరంగ మార్గం తయారవుతుంది.

జలమార్గాల్లోనూ..

టన్నెల్స్‌ను జలమార్గాల్లోనూ వాడటం వందల ఏళ్ల క్రితం నుంచే ఉంది. ఇంగ్లండ్‌లోని మాంచెస్టర్ ప్రాంతంలోని లాంకషైర్ కౌంటీలో 52 మైళ్ల పొడవున కాలువ మార్గాల్ని మలిచారు. 1776లో జాన్ గిల్‌బెర్ట్, జేమ్స్ బ్రిండ్లీ అనే ఇంజనీర్లు సృష్టించిన ఈ అద్భుతం ఆశ్చర్యపరిచేలా ఉంటుంది. బ్రిడ్జివాటర్ డ్యూక్ అయిన ఫ్రాన్సిస్ ఎగెర్టన్ తన గనుల నుంచి బొగ్గును తరలించేందుకు వర్స్లీ నుంచి మాంచెస్టర్ వరకు కాలువల్ని నిర్మించ తలపెట్టాడు. 1759లో ప్రారంభమైన పనులు 1776లో లివర్‌పూల్ వరకు మరో 30 మైళ్లకు పొడగించబడ్డాయి. భూమ్యాకర్షణ శక్తి ద్వారా పడవలు తేలికగా గనుల నుంచి మార్గాల్లోకి ప్రవేశించేలా వీరు ఉపయోగించిన సాంకేతికత వల్ల దాదాపు సగం ధరకు బొగ్గు లభ్యమైంది. ఇదే ప్రపంచంలోని అతి పెద్ద సొరంగ జలమార్గం. ఈ మార్గాల గుండా మహిళలు, పిల్లలు కూడా గనుల నుంచి బొగ్గును తెచ్చుకునేవారు.

మన సొరంగాలు

విదేశాల్లో మాదిరి మనదేశంలో టన్నెల్స్ వ్యవస్థ విస్తరించకోకున్నా కొన్ని దుర్గమ ప్రాంతాల్లో మాత్రం అవే రవాణా జీవ నాడులుగా ఉన్నాయి. సొరంగ రైలు మార్గాలు ఎక్కువగా పశ్చిమ కనుమల్లోనే ఉన్నాయి. మిగతా పర్వత ప్రాంతాల్లోను వీటి నిర్మాణం ఇప్పుడిప్పుడే ఊపందుకుంటోంది. స్వర్ణ చతుర్భుజి రవాణా మార్గ వ్యవస్థలో అనేక ఎక్స్‌ప్రెస్ వేలను, హైవేలను కలుపుతూ పలు టన్నెల్స్ ఉన్నాయి. ఢిల్లీలోని అండర్ గ్రౌండ్, ఎయిర్ మెట్రోలోను టన్నెల్స్ కీలకమే. దేశంలోనే తొలిసారిగా కోల్‌కతాలో నది కిందుగా టన్నెల్ వ్యవస్థను నిర్మిస్తున్నారు. జమ్ముకాశ్మీర్‌లను అనుసంధానిస్తూ వేసిన పీర్‌పంజాల్ టన్నెల్ వ్యవస్థ రైలు కూత కూడా ఇప్పుడు వినిపిస్తోంది.

రోహ్‌తంగ్ టన్నెల్- రోహ్‌తంగ్ పాస్ కింద హిమాలయాల్ని తొలచి లేహ్-మనాలి హైవేలో ఈ టన్నెల్ నిర్మించతలపెట్టారు. ప్రపంచంలోనే అతి ఎత్తైన చోట రోడ్ టన్నెల్‌గా ఇది రికార్డు సృష్టించనుంది.

జవహర్ టన్నెల్ - ఆసియాలో అతి పొడవైన రోడ్డు టన్నెల్స్‌లో ఇది ఒకటి. కాశ్మీర్ లోయను, జమ్ము-శ్రీనగర్ హైవేకు ఇది అనుసంధానిస్తుంది. తొలుత విపరీతంగా మంచు పేరుకుపోవడంతో అర్ధరాత్రి నుంచి తెల్లారి 8 గంటల వరకు దీన్ని మూసిఉంచేవారు. ఇప్పుడు రోజంతా వాహనాల్ని అనుమతిస్తున్నారు.

మాలిగూడ టన్నెల్ - ప్రపంచంలోనే రెండో అతి ఎత్తైన బ్రాడ్‌గేజ్ రైలు సొరంగ మార్గమిది. ఒడిశాలోని గిరిజన కొండల్లో దీన్ని నిర్మించారు. ఇదో పర్యాటక రైడ్‌గా గుర్తింపు పొందింది.

కార్బులె టన్నెల్ - మహారాష్ట్ర రత్నగిరి దగ్గరలోని కొంకణ్ రైల్వే రూట్‌లో ఉన్న ఈ రైలు టన్నెల్ దేశంలోనే పొడవాటిది.

భాటాన్ టన్నెల్ - ఆరు లేన్‌లుగా ఉన్న ముంబై-పూణె ఎక్స్‌ప్రెస్ వే వ్యవస్థలో 5 టన్నెల్స్ ఉన్నాయి. ఇవి ముంబై నుంచి పూణెకు ప్రయాణ కాలాన్ని రెండు గంటలకు కుదించింది. చెన్నై-నస్రీ టన్నెల్ కూడా ప్రత్యేకమైందే. 9 కిలోమీటర్లు దూరం వేసిన ఈ టన్నెల్ వల్ల 30 కిలోమీటర్ల ప్రయాణం కలిసివచ్చింది. ఇక బొర్రా గుహలకు తీసుకువెళ్లే అరకు సొరంగ రైలు మార్గం ఎన్నో అనుభూతుల్ని మిగులుస్తుంది.విశాఖపట్నంకు 114కిలో మీటర్ల దూరంలో అనంతగిరి పర్వత శ్రేణిలోని ఎత్తైన కొండలపై పదుల సొరంగాల గుండా సాగే ఆ ప్రయాణం మరిచిపోలేరు.కొత్తవలస కిరం డోల్ రైల్వే లైనులో సాగే ఈ ప్రయాణంలో 58 సొరంగాలు, 84 వంతెనలు ఎదురుపడతాయి. సముద్ర మట్టం నుంచి 2989 అడుగుల ఎత్తులో వీటిని నిర్మించారు. త్రిపురలోని ఖోవై, సాంగర్ టన్నెల్‌లు ఇంజినీరింగ్ అద్భుతాలే.

ఆ గ్రామం మతిమరుపున్న వారికే...

మతిమరుపుతో వృద్ధుల తంటాలు అన్నీ ఇన్నీ కావు. జీవిత భాగస్వామినే మర్చిపోయే అల్జీమర్స్ బాధితులకు చివరి రోజులు నరకంతో సమానం. వారి కోసం ఎన్నో హాస్పిటల్ కమ్ కేర్ సెంటర్లు విదేశాల్లో ఉన్నాయి. కానీ అవేవి ఓ డచ్ సంరక్షణ గ్రామానికి సరితూగవు. కేవలం డిమెన్షియా వృద్ధ రోగుల కోసమే నెలకొల్పిన అది వారికి ఆస్పత్రి కాదు. వారి సొంతూరు, సొంత ఇల్లు, సొంత జీవితం. మందుల ద్వారా కాక జీవిక ద్వారా అద్భుతాలు సృష్టిస్తున్న హోగ్‌వే గ్రామం నుంచి వైద్య లోకం నేర్చుకోవాల్సింది చాలా ఉంది. చికిత్సా కేంద్రాన్నే గ్రామంగా ఏమార్చి రోగుల జీవితాల్ని సంతోషాలతో నింపుతున్న పేద్ద ప్లాసిబో గ్రామమిది.

నెదర్లాండ్స్‌లో ఆమ్‌స్టర్‌డ్యామ్‌కు చేరువలో 1998లో ఓ మోడల్ గ్రామంగా ఏర్పాటు చేయబడ్డ ఇది తీవ్ర మతిమరుపుతో చిక్కులు పడే వృద్ధుల చికిత్సా కేంద్రమే. కానీ, ఏ వైద్యుడు, నర్సు కూడా తెల్లటి గౌన్లలో కనిపించి ఆస్పత్రి వాతావరణానికి ఆహ్వానం పలకరు. 1950 నాటి నుంచి 2000 కాలం వరకు ఉన్న సంస్కృతులు, తరాలు, పద్ధతులు, శైలులన్నీ అక్కడ పోగుబడి ఓ కొత్త లోకంలో విహరిస్తున్నట్టు ఉంటుంది. పాతకాలాన్ని గుర్తుకు తెచ్చే భవంతులు, ఇంటి ముందు తోటలు, పాత ఫ్యాషన్లు, పదుల ఏళ్ల వెనకటి పాప్‌కల్చర్ ఇలా ఏదో బ్లాక్ వైట్ సినిమాలోని ఊళ్లను కలర్ అద్దుకుని చూసుకున్న భావన కలుగుతుంది. ఏడు శైలుల్లో, పలు కాలాలకు చెందిన వాతావరణాన్ని కేవలం డిమెన్షియా రోగుల కోసమే రూపొందించారు. కిరాణా దుకాణాల వద్ద కాయగూరలు బేరమాడుతూ, ట్రాలీల్లో సరుకులను నింపుతూ దినచర్యలో పడిపోయే పెద్దల్ని చూస్తే అసలు వీరందరికీ నిజంగా రోగం ఉందా అని అనిపించకమానదు. అల్జీమర్స్ రోగులంతా ఇలా వీధుల్లో తిరుగుతుంటే పట్టించుకునేవారేరని ఇక్కడి గురించి తెలియని కొత్తవారికి ఆశ్చర్యం, భయం, కోపం కూడా కలగొచ్చు.కబుర్లు చెబుతూనో రోడ్ల వెంట కదులుతుంటారు. సరిగ్గా గమనిస్తే గనుక వారి మధ్యే సాధారణ దుస్తుల్లో సహాయకులు కనిపిస్తారు. తోటపనివారిగానో, ట్రాఫిక్ కాన్‌స్టేబుల్‌గానో, పోలీస్ అధికారిగానో, కిరాణా దుకాణం యజమానిగానో, కెఫెటేరియా సర్వెంట్‌గానో వారు మారు వృత్తులు చేస్తూనే రోగుల్ని ఓ కంట కనిపెడుతుంటారు. ఇళ్లలో ఒకరో ఇద్దరో పనివాళ్లగానో, పేయింగ్ గెస్టులుగానో అవతారమెత్తి ఒక్కో ఇంటిలో కార్యక్రమాల్ని చక్కబెడుతుంటారు.

జీవితం సరికొత్తగా...

అసలు ఈ సంరక్షణ గ్రామం ఉద్దేశం కూడా ఇదే. మానసిక వ్యాధులతో సతమతమయ్యేవారు ముఖ్యంగా డిమెన్షియాతో ఇబ్బందిపడేవారి పరిస్థితిని దిగజారుస్తుంది ఒంటరితనం, ఏకాకిగా బతకడం (ఐసొలేషన్). దీనివల్ల మైలీన్-ఎ అనే ఫైబర్ ఉత్పత్తి తగ్గిపోయి నాడీ కణాలు మరింత దెబ్బతింటాయి. దీని నుంచి బయటపడేసేందుకు ఈ గ్రామం ఎంచుకున్న మార్గం రోగుల దైనందిన జీవితాన్ని సాధ్యమైనంత వరకు యాక్టివ్ చేయడం. వారి షార్ట్ టైమ్ మెమరీ మెరుగ్గా పనిచేసిన జీవితకాలంలోకి మళ్లీ వారి రోజుల్ని సరికొత్తగా ప్రారంభించేలా చేయడం. ఇక్కడెవరూ రోగులు కాదు. అంతా హోగ్‌వే గ్రామస్తులే. ఎవరికీ తమలోని మతిమరుపు లోపాన్ని పట్టించుకునే అవకాశం ఇవ్వకుండా, నెగటివ్ ఆలోచనలకు తావు లేకుండా నిర్వాహకులు మసలుకుంటారు. వంటపని, తోట పని, వ్యాహ్యాళి, సినిమా, ఆటవిడుపు ఇలా ఓ సాధారణ వ్యక్తి జీవితం ఎంత పాజిటివ్ బిజీ అయిపోతుందో అలా రోగుల దినచర్యను వారికి తెలియకుండానే ప్లాన్ చేస్తారు. తరచూ కలిసే కుటుంబీకులు, బంధువులు, స్నేహితుల వల్ల రోగులకు అదో ప్రత్యేక సంరక్షణ కేంద్రమనే భావన తలెత్తదు. తాము చికిత్సలో భాగమైన రోగులనే బాధ ఉండదు. ఈ తరహా వైఖరి అద్భుతాలు సృష్టించింది. మిగతా సంరక్షణ కేంద్రాల్లో రోగుల పురోగతితో పోల్చితే ఇక్కడి వారి మలి జీవితం ఎంతో సంతోషంగా, హాయిగా గడుస్తోంది. తక్కువ మందుల అవసరం, ఆరోగ్యకర తిండి అలవాట్లు, దీర్ఘాయుష్షు, సంతోషకర జీవితం, మతిమరుపు తగ్గుదల వంటివి మిగతా అధునాతన చికిత్సా కేంద్రాల కన్నా మెరుగైన ఫలితాల్ని అందిస్తోందని సర్వేల్లో తేలింది. ఇంగ్లండ్‌లోని ఫార్‌టౌన్‌లో, స్విజర్‌ల్యాండ్‌లోని వీడిల్స్‌బాచ్‌లో ఈ తరహా సంరక్షణ గ్రామాల్ని తెరిచారు.

మొత్తంమీద వీరు నమ్మే సిద్ధాంతం ఒకటే. రోగానికి కేవలం మందు వేస్తే సరిపోదు, రోగిని తమ బలహీనతల వల్ల కుదేలు కాకుండా, ఒంటరితనం బాధించకుండా సహచరిగా ఉండటమే. ఇది ఫేక్ రియాల్టీయే కావొచ్చు. కానీ, అబద్ధం కూడా అందమైన మార్పు తెస్తోంది కదా. లేని రోగానికి ప్లాసిబో ఇచ్చి స్థిమితపరచడం తెలిసిందే. ఇదీ ప్లాసిబోనే కానీ చాలా విలక్షణమైన, విస్తారమైన తీపి గుళిక. ✦

నవ్వుల్ – పువ్వుల్

దూరం

ఈ మందును దెబ్బ తగిలిన చోట రోజుకు రెండు సార్లు రాయండి చెప్పాడు డాక్టర్.
"అబ్బే కుదరదండీ" పెదవి విరిచాడు వైకుంఠం.
"అదేం"
"దెబ్బ తగిలిన చోటు ఇక్కడికి 10 కిలోమీటర్ల దూరం" అమాయకంగా చెప్పాడు వైకుంఠం.

ఉచితం

"డాక్టర్ గారూ నేను చాలా పేద వాడినండీ. మీరడిగనంత ఫీజు ఇచ్చుకోలేను. ఎట్టాగైనా నాకు వైద్యం చేయండి బాబూ...కానీ జీవితాంతం నేను పైసా పుచ్చుకోకుండా మీ కుటుంబం అంతటికీ పని చేసి పెడతాను" వినయంగా అన్నాడు ఒక వ్యక్తి
సరే ఇంతకు నువ్వేం పని చేస్తుంటావు? అడిగాడు డాక్టర్
"కాటికాపరినండీ.... శవాలు తగలబెడుతుంటాను" అన్నాడతను.

పిసినారి ప్రేమికులు

ఒక పిసినారి అబ్బాయి, ఒక పిసినారి అమ్మాయి ప్రేమించుకుంటున్నారు.
అమ్మాయి: మా డాడీ పడుకున్నాక కాయిన్ కింద పడేస్తాను అదే సిగ్నల్ అనుకొని పైకి వచ్చేయ్.
అబ్బాయి: ఓకే...ఓకే...
పది నిమిషాల తరువాత...
ఒక కాయిన్ కింద పడిన శబ్దం వస్తుంది. కాని అబ్బాయి ఆరోజు రాత్రి రాడు.
తరువాత రోజు..
అమ్మాయి: ఏం నిన్న రాత్రి రాలేదు? సిగ్నల్ వినిపించలేదా.....
అబ్బాయి: అదేం కాదు వినిపించింది.
అమ్మాయి: మరి ఎందుకు రాలేదు?
అబ్బాయి: కాయిన్ పడేశావుగా అది వెతుకుతూ రాత్రంతా కిందే ఉండిపోయా. నా బ్యాడ్ లక్ కాయిన్ దొరకలేదు.
అమ్మాయి: అరేయ్ ఇడియట్. కాయిన్‌కి దారం కట్టి విసిరాను. కాయిన్ కింద పడగానే పైకి లాగేశా.

తగిన చోటు

మోకాళ్ళ నొప్పులకు నేను ఒక దివ్యౌషధం కనిపెట్టాను.షాపు ఎక్కడ పెడితే సరకు బాగా అమ్ముడౌతుంది? అని సలహా అడిగాడు శంకర్.
ఆర్.టి.సి బస్ స్టాప్ దగ్గర పెట్టు. వ్యాపారం బాగా సాగుతుంది అన్నాడు నారాయణ.

టికెట్

కౌంటర్ అబ్బాయి: ఇందాకే టికెట్ తీసుకున్నారుగా, మళ్ళీ ఎందుకు తీసుకుంటున్నారు.
వెంగళప్ప: లోపలికి వెళుతుంటే ఒకడు టికెట్ తీసుకుని చింపేశాడు..!

పెద్ద ఫ్యామిలీ

చాలా పెద్ద ఫ్యామిలి అంటే నమ్మి పెళ్ళి చేసుకున్నా. తరువాత తెలిసింది మోసపోయానని విచారంగా అన్నాడు ముత్యాలరావు
ఏమైంది వాళ్ళు పేదవారా? అడిగాడు మణి.
అదేం కాదు. ఆమెకు ఆరుగురు అన్నలు, ఏడుగురు చెల్లెళ్ళు, అమ్మమ్మ, తాతయ్య, బామ్మ అందరూ ఒకే ఫ్యామిలీ" అని భోరుమన్నాడు ముత్యాలరావు.

స్విమ్మింగ్ పూల్

పిచ్చి ఆసుపత్రిలో ఒక పిచ్చివాడు స్విమ్మింగ్ పూల్‌లో పడితే మరో పిచ్చివాడు రక్షిస్తాడు.
ఇది చూసిన డాక్టర్ ఆ ఇద్దరు పిచ్చివాళ్ళను ఒకే గదిలో ఉంచమని సిబ్బందిని ఆదేశిస్తాడు.
మరుసటి రోజు చూస్తే నీళ్ళలో పడిన వ్యక్తి ఫ్యానుకి ఉరి వేసుకుని ఉంటాడు. డాక్టర్ పిచ్చి వాడితో ఏమయ్యా నిన్న బాగానే ఉన్నాడుగా మీ వాడు. మరి ఎందుకు అలా ఫ్యానుకి ఉరి వేసుకున్నాడు?
ఓహో అదా... నిన్న నీళ్ళలో పడి బాగా తడిసాడుగా అందుకే నేనే అలా ఆరేశానన్నాడు రెండో వాడు.

హుర్రే... మహా మర్రి...

కథైనా.. కలైనా ...
కారడవైనా...కుగ్రామమైనా ... మర్రి మాను వుండాల్సిందే. మనకు, మర్రి వృక్షానికి వున్న అనుబంధం అలాంటిది. గ్రామ కూడళ్లలో, గుళ్ల దగ్గర, రోడ్ల మీద ... అలసిన వారికి సేద తీర్చే వనరు మర్రి మాను. ఊడలతో ఊయలలూగే చిన్నారుల కేరింతలతో, పక్షుల కిలకిలారావాలు, మంకెన్నల కిచకిచలతో సందడిగా వుండే మర్రికి 'జాతీయ వృక్షం' హోదానిచ్చి గౌరవించుకుంటున్నాం.
దేశంలోని అతి పెద్ద అయిదు మర్రి మానుల విశేషాలు...

తిమ్మమ్మ మర్రిమాను

పేరుకు మర్రి చెట్టే. గిన్నిస్ రికార్డులకెక్కింది. కదిరి పట్టణానికి 35 కిమీ దూరంలో అనంతపురం నగరానికి 100 కిమీ దూరంలో గూటిబయలు గ్రామంలో వుంది. దక్షిణ భారత దేశంలో అతి పెద్ద మర్రి వృక్షంగా పేరు సంపాదించుకుంది. ఏది మొదలో ఏవి కొమ్మలో తెలీనంతగా... ఆరు నుంచి ఎనిమిది ఎకరాల విస్తీర్ణంలో ... అల్లుకుపోయిందీ మహా మాను. నీటి కొరత అత్యధికంగా వున్న రాయలసీమలో తిమ్మమ్మ మర్రిమాను ఆకాశం కనిపించనంత గుబురుగా పెరిగి పచ్చని ఆకులతో పక్షుల చిరు శబ్దాలతో చూపరులను ఆశ్చర్యచకితులను చేస్తుంటుంది. సుమారు 550 సంవత్సరాల వయసుగల అతి పెద్ద వృక్షంగా 1989లో గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డుల్లో స్థానం కూడా సంపాదించుకుంది. ఆకతాయిలు, చిన్నారులు మర్రి మానుకు ఎలాంటి చేటు చేయకుండా...ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు జాగ్రత్తలు తీసుకోవడానికి వీలుగా... 1992లో మర్రి మానును అటవీశాఖ అధీనంలోకి తీసుకుని...చుట్టూ కంచె వేయించింది. సమీపంలోనే శివ ఘాట్, వన్యప్రాణుల సంరక్షణ కేంద్రం వున్నాయి. ప్రతి శివరాత్రికి ఇక్కడ పెద్ద జాతర జరుగుతుంది.

పిల్లల మర్రి మాను

దీన్నే పీర్ల మర్రి అని కూడా పిలుస్తుంటారు. మహబూబ్ నగర్ పట్టణానికి 4 కిలోమీటర్ల దూరంలో వున్న ఈ మాను యాత్రికుల ప్రత్యేక సందర్శనీయ ప్రదేశం. పరిమాణంలో భారతదేశంలోనే మూడవదైన ఈ మహావృక్షం సుమారు 700 సంవత్సరాల నాటిది. ఈ చెట్టును దూరం నుంచి చూస్తే దట్టమైన చెట్లతో నిండిన కొండలా, చిన్నసైజు అడవిలా వుంటుంది. దగ్గరకెళ్లి చూస్తే వెయ్యిమందికి నీడనిచ్చే పెద్ద గొడుగులా వుంటుంది. 3 ఎకరాల విస్తీర్ణంలో మొదలెక్కడో...కొమ్మెక్కడో తెలియకుండా ఓ మహావృక్షంగా ఏర్పడింది. ఈ మర్రికి పిల్లలు అంకురించడంతో ఇది పిల్లలమర్రిగా మారింది. పిల్లలమర్రి మ్యూజియాన్ని 1976లో ప్రారంభించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో చేపట్టిన తవ్వకాల్లో లభ్యమైన కమనీయ శిల్పాలను పురావస్తుశాఖ వారు ఇక్కడి మ్యూజియంలో వుంచారు. క్రీశ 7వ శతాబ్ది నుంచి 15 శతాబ్ది శిల్ప పరిణతిని చాటే అపురూప శిల్పాలు ఇక్కడ వున్నాయి. రెండు వేల సంవత్సరాల కాలం నాటి మధ్యరాతి యుగానికి చెందిన వస్తువులు, చాళుక్యుల కాలం నుంచి విజయనగర కాలం నాటి వరకు ఎన్నెన్నో అపురూపమైన శిల్పాలు ఇక్కడ కొలువు తీరాయి. విహారయాత్రకు వచ్చే వారి కోసం ఇక్కడ మినీ జూ పార్కు, చిన్న నర్సరీలు ఉన్నాయి. రకరకాల పక్షులు, నెమళ్లు, కుందేళ్లు, కోతులు, జింకలు ఇక్కడ ప్రత్యేకం. చేపల అక్వేరియం కూడా పర్యాటకులను ఆకట్టుకుంటుంది. ఇక్కడ సినిమాల షూటింగులూ జరుగుతుంటాయి.

అడయార్ మర్రి మాను

అడయార్‌లోని మర్రి మానుకు 450 ఏళ్లుంటాయి. ప్రపంచంలోని అత్యంత వృద్ధ మర్రి మానుల్లో ఒకటిగా పేరు సంపాదించుకుంది. చెన్నైలోని అడయార్ నగరంలోని థియొసాఫికల్ సొసైటీ ప్రాంగణంలో వుందీ మాను. ఔత్సాహిక సందర్శకులకు ఎప్పుడూ కొదవ వుండదు. సుమారుగా 40,000 చదరపు అడుగుల స్థలంలో కనిపించే వేలాది ఊడలు చూపరులను ఆశ్చర్యచకితులను చేస్తుంటాయి. అయితే ఈ మర్రి మొదలు భాగం చాలా వరకు 1989లో వచ్చిన తుఫాను కారణంగా నాశనమైపోయింది. ఇప్పుడు మన కళ్లెదుట వున్నది ప్రధానంగా దాని పిల్ల వేళ్లేనంటే ఆశ్చర్యం వేస్తుంది.

ది గ్రేట్ బన్‌యన్

కొల్‌కతాలోని అత్యంత భారీ మర్రి మాను 'ది గ్రేట్ బన్‌యన్'. ఇది హౌరాలోని ఆచార్య జగదీష్ చంద్ర బోస్ ఇండియన్ బొటానికల్ గార్డెన్‌లో వుంది. ఇది ఒక్క వృక్షంలా వుండదు. అనేక వృక్షాలు పెనవేసుకుని అల్లుకొన్న అడవిలా కనిపిస్తుంది. నాలుగు ఎకరాల స్థలంలో విస్తరించిన ఈ మానుకు 250 ఏళ్ల వయసు వుంటుందంటారు. 19వ శతాబ్దానికి చెందిన పలు యాత్రా గ్రంథాల్లో గ్రేట్ బనయన్ ప్రస్తావన వుంది. ఎన్నో ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కొని నేటికీ బలిష్టంగా నిలబడింది. 1884, 1886 సంవత్సరాలలో వచ్చిన పెను తుఫాన్ల సమయంలో పడిన పిడుగుల వల్ల మాను కొంత భాగం నాశనమైంది. ప్రస్తుతానికి 3300 ఊడలు నేలలోకి చొచ్చుకుపోయాయి. 273 ఎకరాల స్థలంలో వున్న బొటానికల్ గార్డెన్‌లో పలు దేశాల నుంచి సేకరించిన 12 వేల అరుదైన మొక్కలు చూపరులను ఆశ్చర్యచకితులను చేస్తాయి. మొత్తం మీద ఈ గార్డెన్, బన్‌యన్ ట్రీ ... గిన్నిస్ రికార్డుల్లో స్థానం సంపాదించుకున్నాయి.

బిగ్ బన్‌యన్ ట్రీ

కర్నాటకలోని రామొహల్లి అనే చిన్ని గ్రామంలో ఈ మెగా మర్రి మాను కొలువు తీరింది. ప్రపంచంలోకెల్లా అతి పెద్దవైన తిమ్మమ్మ మర్రిమాను (ఆంధ్రప్రదేశ్), బన్‌యన్ ట్రీ (కొల్‌కతా), అడయార్ మర్రి మాను (చెన్నై) తర్వాత మెగా మర్రి మానుగా పేరు సంపాదించుకుంది బిగ్ బనయన్ ట్రీ. ఇది 5 ఎకరాల స్థలంలో వ్యాపించింది. కన్నడంలో దీన్ని 'దొడ్డ అలాడ మర' అని పిలుస్తారు. చిక్కటి కొమ్మల వల్ల ... ఆ మహా మాను పరిసరాల్లో ... ఎంత నడిచినా అలసట అన్న మాటే దరి చేరకుండా చల్లగా హాయిగా వుంటుంది. చుట్టూ అందమైన కంచె, సన్నటి కాలిబాటలు, సిమెంటు కుర్చీలు చూడ్డానికి ప్రశాంతమైన పార్కులా వుంటుంది. కుటుంబ విహారానికి ఇది సరైన స్థలం. పైగా ప్రవేశద్వారం దగ్గర మొక్కజొన్న పొత్తులు, వేయించిన వేరుశనగల చిరు వ్యాపారం జోరుగా సాగుతుంటుంది. ఈ పరిసరాల్లోనే శివాలయం కూడా వుంది. సినిమా షూటింగులకు అనువైన ప్రదేశంగా కూడా గుర్తింపు వుంది. ఈ కన్నడ మహామర్రి మానుకు సమీపంలో కొలువు దీరిన కొండలు, చిన్న సైజు మంచనబెలె రిజర్వాయరు కూడా సందర్శకులను ఆకట్టుకుంటుంది. అయితే ఎంతో ఉత్సాహంగా మర్రి మానును చూద్దామని వెళ్లినవారు ఒక జాగ్రత్త తీసుకోవాలి. చెట్లకు మరీ దగ్గరగా వున్నప్పుడు ఎలాంటి తినుబండారాల జోలికి వెళ్లకపోవడం మంచిది. మంకెన్నలు పెద్ద సంఖ్యలో అక్కడే తిరగాడుతుంటాయి మరి.

గౌతమి చల్లని స్పర్శ ఎంతమందిని పునీతుల్ని చేసిందో.. గోదారమ్మ చెంత సేదతీరి పెరిగిన లేత మనుసులు ఎంత గొప్ప ఆచార్యత్వాన్ని సంతరించుకున్నాయో. ఎందరో మహానుభావులు... వారిలో ఆదుర్తి సుబ్బారావు ఒకరు.

1912 డిసెంబరు 16న శాతన్న పంతులు, రామలక్ష్మమ్మ దంపతులకు ఆదుర్తి జన్మించారు. తండ్రి అప్పటికే ప్రభుత్వ తహసిల్దారుగా వున్నందున గారాబంగా ఆదుర్తి పెరిగాడని చెప్పనవసరం లేదు. తన మెట్రిక్యులేషన్ చదువు పూర్తయిన తరువాత కాకినాడ పి.ఆర్.కాలేజీలో పి.యు.సి కోర్సుని చేశాడు. అప్పటికే కాకినాడ కళాకారులతో కళకళలాడుతుండేది. ఆ ప్రభావం ఆదుర్తి మీద పడింది. ఆదుర్తికి చదువు కంటే ఏదైనా శాస్త్రీయ కళా పరిజ్ఞానంపై పట్టు

దర్శక దార్శనికుడు

సాధించాలనే ఆలోచనలు సాగుతుండేవి. అందుకే బొంబాయి సెయింట్ జేవియర్స్ కాలేజీలో మూడేళ్ళపాటు ఫోటోగ్రఫీలో శిక్షణ కోసం చేరాడు. రెండేళ్లయ్యే సరికి అతని ఆలోచనలు ఫిలిం ప్రాసెసింగ్, ప్రింటింగ్‌ల మీదకు మళ్ళాయి. ఆ సమయంలోనే సుప్రసిద్ధ ఫిలిం ఎడిటర్ దినా నార్వేకర్ దగ్గర సహాయకుడిగా చేరాడు. స్వతహాగా రచయితగా, ఛాయాగ్రాహకుడిగా, ఎడిటర్‌గా అనేక శాఖల్లో అభిరుచిని పెంపొందించుకున్న ఆదుర్తి తర్వాతి రోజుల్లో సుప్రసిద్ధ దర్శకుడు



ఉదయ్ శంకర్ దగ్గర సహాయకుడిగా చేరాడు. 'కల్పన' అనే సినిమాకి సహాయ దర్శకుడిగా పనిచేశాడు. ఆదుర్తికి ఇంకా ఏదో వెలితి. ఏదో సాధించాలన్న తపన. తిరిగి చెన్నపట్నం వచ్చి మొట్టమొదట తమిళంలో 'పారిజాతాపహరణం' చిత్రానికి ఎడిటర్‌గా తన ప్రతిభని కనపరిచాడు.

తొలిరోజుల్లో అన్నీ నిరాశలే!

తెలుగు పరిశ్రమ ఎదుగుతున్న రోజుల్లో దిగ్గజాల్లాంటి దర్శకులుండేవారు. తాతినేని ప్రకాశరావు, కె.యస్. ప్రకాశరావు, ఎల్వీ ప్రసాద్, బి.ఎ. సుబ్బారావు, కె.వి.రెడ్డి, బి.యన్. రెడ్డి, హెచ్‌ఎమ్ రెడ్డి, బి.ఆర్.పంతులు, చిత్రపు నారాయణ మూర్తి ఇత్యాది ఘనాపాటీలంతా కొలువు దీరి వున్నారు. వీరి మధ్య ఆదుర్తి ఆలోచనలు చిన్న పిల్లాడివిగా కనిపించేవి. పైగా ఎవరైనా ఏదో ఒక శాఖ మీదే దృష్టి పెట్టాలి. రెండు పడవల మీద కాలు వెయ్యకూడదు. అలాంటిది అయిదు పడవల మీద ప్రయాణం ప్రమాదకరం అని హెచ్చరించారు. ఈ మాటలు ఆదుర్తికి ములుకుల్లా గుచ్చుకునేవి. మరింత కసితో సినిమా నిర్మాణంలో ఉన్న శాఖల మీద పట్టు సాధించాడు. కథ, మాటలు, ఎడిటింగ్, సౌండ్, ఛాయాగ్రహణం, స్క్రీన్ ప్లే, దర్శకత్వం... ఏ శాఖ చేపట్టినా తనదైన ముద్ర వేయగల ప్రతిభను సంపాదించుకున్నాడు. ఆదుర్తి కుటుంబ నేపథ్యాన్ని విడిచిపెట్టలేదు. మానవ సంబంధ మాధుర్యాన్ని విడిచి పెట్టలేదు. సెల్వరాజ్ ఫోటోగ్రఫీ తెలుగులో ద్విపాత్రాభినయ చిత్రాలకు ఓ ట్రెండ్ సెట్టర్ అయింది.

చిత్రాలన్నీ ఆణిముత్యాలే!

బాబూ మూవీస్ సంస్థలో అఖండ విజయాలు సాధించిన ఘనత ఆదుర్తికే దక్కింది. మంచి మనసులు, మూగమనసులు ఆ రోజుల్లో రజతోత్సవ, స్వర్ణోత్సవాలు జరుపుకున్న చిత్రాలు. గత జన్మ జ్ఞాపకాల మీద సాగిన కథ.

మొట్టమొదటిసారిగా తెలుగు సినిమా సెట్‌లోంచి గోదారమ్మ చెంత పరవశించి చిందులేసిన సినిమా మూగ మనసులు. చిత్రంలో అక్కినేని, సావిత్రి, జమునల ముగ్గురి పాత్రలూ చిరస్మరణీయాలు. దాగుడు మూతలు, డాక్టరు చక్రవర్తి, వెలుగు నీడలు, సుమంగళి.. అన్నీ విజయవంతమైన చిత్రాలే. తేనె మనసులు చిత్రం సొంతంగా నిర్మించి దర్శకత్వం వహించాడు. ఆ సినిమాలో చాలా మంది కొత్త తారలు పరిచయమయ్యారు. కృష్ణ, రామ్ మోహన్, సుకన్య, సంధ్యారాణి, రావి కొండల రావు, వెంకటేశ్వరరావు, పుష్పకుమారి, నల్ల సుశీల (అర్చన తల్లి) పరిచయమయ్యారు. ఈ సినిమా కూడా అఖండ విజయం సాధించింది. 'తోడు-నీడ' ఎన్టీఆర్, జమున, భానుమతి, ఎస్వీఆర్, నాగయ్య ప్రధాన పాత్రలుగా నిర్మించిన చిత్రం. (తమిళంలో కర్పగం చిత్రం) పూల రంగడు.. ఇలా అన్నీ విజయవంతమైన చిత్రాలే. తెలుగు సినిమా మీద ఆదుర్తి ముద్ర అనితర సాధ్యం!

అవార్డులూ..రివార్డులూ...

అవార్డులకు అతీతమైన సినిమాలు.. ఆదుర్తి సినిమాలు. 'తోడికోడళ్ళు' సర్టిఫికెట్ ఆఫ్ మెరిట్, ద్వితీయ ఉత్తమ చిత్రం, 'మాంగల్య బలం' ఉత్తమ చిత్రం, 'నమ్మిన బంటు' రాష్ట్రపతి రజత పత్రం, 'మూగమనసులు' ఉత్తమ చిత్రం, 'డాక్టరు చక్రవర్తి' ఉత్తమ చిత్రం, 'మనుషులు-మమతలు' ఉత్తమ చిత్రం, 'సుడిగుండాలు' ఉత్తమ చిత్రం, 'ఆదర్శ కుటుంబం' ఉత్తమ చిత్రం.. ఇలా పలు జాతీయ, ప్రాంతీయ భాషా విభాగాల్లో జాతీయ అవార్డులు సాధించాయి. డాక్టరు చక్రవర్తి, సుడిగుండాలు, మహాకవి క్షేత్రయ్య చిత్రాలు నంది అవార్డులను గెలుచుకున్నాయి.

అధ్యయన గ్రంథాలు

మావన సంబంధాల్లోని జీవన మాధుర్యం మీద అల్లబడిన కథలన్నీ ఆదుర్తి చేశాడు. సగటు ప్రేక్షకుడికి సినిమాని దగ్గర చేశాడు. తెలుగు సినిమా పరిశ్రమ ఆదుర్తి చిత్రాల్ని అధ్యయన గ్రంథాలుగా పరిగణించాలి. మానవ సంబంధాల మీద ఆదుర్తి అల్లుకున్న అందమైన కథల్ని మరొకరు తయారుచేసుకోలేకపోయారు. తనదైన సువిశాల మైన సామ్రాజ్యాన్ని విస్తరించుకొని సూపర్ స్టార్ కృష్ణని మనకు అందించిన ఘనత ఆదుర్తిదే. కళా తపస్వి విశ్వనాథ్‌ని తెలుగు చిత్ర వైభవాన్ని దశ దిశలా చాటడానికి కేటాయించిన ఘనత ఆదుర్తిదే.

అమర సందేశంతో..

అప్పటి హీరో అమరనాథ్ ఒక వెలుగు వెలిగి విరిగిపడి మళ్ళీ తన ఉనికిని కాపాడుకునే దిశలో చిత్ర నిర్మాణం ప్రారంభించాడు. తక్కువ బడ్జెట్‌లో ఉన్నత ప్రమాణాలు చూపించగల, సమర్థుడైన, అందుబాటులో ఉండే దర్శకుడి కోసం ఆలోచిస్తుండగా ఆదుర్తి అన్ని విధాలా

'మూగ మనసులు' షూటింగ్ సందర్భంగా ఆదుర్తి సుబ్బారావు, అక్కినేని, సావిత్రి, కె.విశ్వనాథ్, టి.కృష్ణ

సమర్థుడనిపించాడు. అయితే అప్పటికీ అన్నపూర్ణ అధినేత దుక్కిపాటి మధుసూదనరావు దృష్టిలో ఉన్నాడు. కానీ రిస్క్ చేయలేరు కదా. ఆదుర్తిలోని ప్రతిభని మొట్టమొదటగా గుర్తించిన వ్యక్తి మాత్రం అక్కినేని నాగేశ్వరరావే! కానీ దుక్కిపాటి మాట కాదనే ధైర్యం లేదు. అమర సందేశం చిన్న సినిమా పెద్ద విజయం సాధించింది. వెను వెంటనే ఆలస్యం చేయకుండా తోడి కోడళ్ళు సినిమాకి దర్శకత్వ బాధ్యతల్ని అప్పగించారు.

ఫ్యామిలీ డ్రామాకి పెద్దపీట

అంతవరకు తెలుగు సినిమా ఎక్స్‌ప్రెషన్ నర్మగర్భంగా ఉండేది. కానీ ఆదుర్తి స్క్రీన్‌ప్లే తెలుగు సినిమా రూపు రేఖల్ని మార్చేసింది. సినిమా వేరు, జీవితం వేరు కాదు.. మన ఇంటి కథ, మన కుటుంబం కథ, మన మధ్య జరుగుతున్న సంఘటనలే సినిమాల్లోనూ కనిపించాలి. అక్కినేని, సావిత్రి ప్రధాన పాత్రధారులుగా కన్నాంబ తల్లిగా రేలంగి, సూర్యకాంతం అన్నా వదినలు, కుటుంబ పెద్దలుగా పాత్రలతో, మంచి సంగీత సాహిత్యాలతో సాగిన తోడి కోడళ్ల చిత్రం అఖండ విజయం సాధించి సంచలనం సృష్టించింది. ఏడాది తిరక్కుండా వచ్చిన మరో గొప్ప చిత్రం మాంగల్య బలం. కథకుడు ఆదుర్తే. ఎస్వీఆర్, సావిత్రి తండ్రీ కూతుళ్ళుగా అక్కినేని మేనల్లుడిగా కన్నాంబ అక్కినేనికి అమ్మమ్మగా నటించారు. చిన్నప్పుడు బొమ్మల పెళ్ళిలో అక్కినేని సావిత్రి పెళ్ళి చేసుకుంటారు. పెద్దయిన తర్వాత తిరుపతికి విహార యాత్ర కోసం వచ్చిన వీరు ప్రేమలో పడతారు. తన కూతుర్ని ప్రేమించిన వ్యక్తి తన మేనల్లుడే అని తెలిసిన సావిత్రి తండ్రి తిరస్కరిస్తాడు. అయినా క్లైమ్యాక్స్ సుఖాంతం. నిజానికి ఆదుర్తి పనితనం ప్రతి ఫ్రేమ్‌లోనూ కనిపిస్తుంది. 'ఇప్పటికీ తెలియని ఆనందం.. నాలో కలిగినదీ ఉదయం', 'ఆకాశ వీధిలో అందాల జాబిలి' ఇలా ఏ పాటని తీసుకున్నా చాలా ఫ్రెష్‌గా ఉంటాయి. ఈ చిత్రం అఖండ విజయాన్ని సాధించింది. ఆదుర్తి పేరు మార్మోగిపోయింది.

దేశ విదేశాల ఆదరణ

ఆ రోజుల్లో శంభు ఫిలింస్ సుప్రసిద్ధ నిర్మాణ సంస్థ. అందమైన రెండు ఒంగోలు గిత్తలను ప్రధాన పాత్రధారులుగా ఎంచి అక్కినేని, సావిత్రి కాంబినేషన్‌లో నమ్మిన బంటు చిత్రం చేశాడు ఆదుర్తి. 'చెంగు చెంగున రంకెలు వెయ్యండి.. ఓ జాతి వన్నె బుజ్జాయిల్లారా.. నోరులేని తువ్వాయిల్లారా..' అంటూ సావిత్రి పాడిన పాట ఇప్పటికీ పల్లెల్లో వినిపిస్తుంది. ఈ సినిమా కూడా అఖండ విజయం సాధించింది. ఈ చిత్రం మాస్కో ఫెస్టివల్‌లోనూ, ఇంటర్నేషనల్ ఫిలిం ఫెస్టివల్‌లోనూ ప్రదర్శించబడి తెలుగు సినిమా సత్తా చాటింది.

ఇద్దరు మిత్రులు గొప్ప ప్రయోగం

ఆదుర్తి క్రియేటివిటీకీ నిలువెత్తు నిదర్శనం ఇద్దరు మిత్రులు చిత్రం. పేదవాళ్ళకు ఎలాగు కష్టాలుంటాయి. డబ్బున్న వాళ్ళకూ కష్టాలుంటాయని, వారి జీవన సరళి, మానసిక సంఘర్షణల మీద అల్లిన కథ ఈ చిత్రం. ముక్కు మీద కోపం వున్నా ఆదుర్తి చప్పున చల్లారిపోతాడు. కె.వి. మహదేవన్, ఆత్రేయలతో అనుబంధం కలకాలం కొనసాగించాడు. అక్కినేనిని జీవిత కాలం మరిచిపోలేదు. ప్రయోగాత్మక చిత్రాలైన సుడిగుండాలు, మరో ప్రపంచం చిత్రాలు తీసి చేతులు కాల్చుకున్నాడు. ఆర్థికంగా హిందీ చిత్రాలు బాగా దెబ్బ తీశాయి. మానసికంగా కుంగిపోయాడు. మిలన్, డోలీ, దర్పణ్, మస్తానా, రఖ్వాలా, జీత్, ఇన్సాఫ్, సునేహు సంసార్ చిత్రాలకు రచన, దర్శకత్వం వహించినా ఈ సినిమాల్లో ఆర్థికంగా ఆదుర్తి పాత్ర ఏమిటో ఎవ్వరికీ తెలియదు. ఆర్థికంగా చెప్పుకోలేని, భర్తీ చేయలేని నష్టాన్ని చవి చూశాడు. అయినా తన సత్తా చాటాడు. అనేక శాఖల్లో తన ముద్రను వేశాడు. ఆదుర్తి సినిమాలు.. అచ్చ తెలుగు కుటుంబ జీవితాలు.

ఇమంది రామారావు
9010133844

అవ్వ పెళ్లి డ్రస్సే కావాలి

అబిగైల్

అది 120 ఏళ్ల నాటి పెళ్లి గౌను. 11 తరాల నుంచి ఆ కుటుంబంలోని వధువులు పెళ్లి నాడు ధరిస్తున్నారు. 12వ పెళ్లికూతురు కూడా త్వరలో ఆ డ్రస్సు వేసుకోవడానికి రెడీ అయిపోయింది. తన అమ్మమ్మలకు అమ్మ ధరించిన 1895 నాటి పెళ్లి దుస్తుల్ని ఫొటోలో చూసిన అబిగైల్ కింగ్‌స్టన్ తన పెళ్లినాడు అలాంటి డ్రస్సే కుట్టించుకుంటానని చిన్ననాటనే ఫిక్స్ అయిపోయింది. పెరిగి పెద్దయ్యాక తన తల్లీ అదే దుస్తుల్ని వేసుకుందని తెలిసి ఆశ్చర్యపోయింది. తల్లిని ఆరా తీస్తే అమ్మమ్మలందరికీ అదే పెళ్లి డ్రస్సు అని చెప్పి నువ్వు కూడా వేసుకుని ఆచారాన్ని కొనసాగిస్తావో లేదోనని భయపడ్డానని చెప్పే సరికి అబిగైల్ సంతోషం అంతా ఇంతా కాదు. ఇంకా ఆ డ్రస్సు ఉందని చెప్పడంతో ఎగిరి గంతేసిన అబిగైల్‌కు ఓ విషయం మాత్రం చాలా కష్టపెట్టించింది. తమ బంధువు ఆగ్డెన్ దగ్గర దాచిన ఆ డ్రస్సు పెన్సిల్వేనియా బెత్లెహెంలోని తన ఇంటికి చేరుకునేసరికి బాగా పాడైపోయింది. 120 ఏళ్లు దాటిన ఆ డ్రస్సు పాలిపోయి, చీకిపోయి, రంధ్రాలు పడి శిథిలమయ్యే దశకు చేరింది. కుట్టినప్పటి నుంచి ఒక్కసారే డ్రైక్లీనింగ్ చేయించారు. దాన్ని బాగుచేసేందుకు డెబోరా లోప్రెస్టీ అనే డిజైనర్‌ను సంప్రదించింది. ఆమె ఆరునెలలు కష్టపడి న్యూయార్క్ అంతా వెతికి మరీ ఆ డ్రస్సుకు మ్యాచ్ అయ్యే సిల్క్ సంపాదించి ప్యాచ్ వర్క్ చేసింది. ఎట్టకేలకు అబిగైల్ పెళ్లి రోజున ఆ డ్రస్సు వేసుకొని మురిసిపోయింది.

1895 నాటి అవ్వ చిత్రం

సముద్ర తోటలు

ఇటలీలో సముద్ర గర్భాన పండ్ల తోట పెంచుతున్నారు. మీరు వినింది నిజమే.. వీటిని నెమో గార్డెన్‌లని పిలుచుకుంటున్నారు. సముద్ర గ్రీన్‌హౌజ్‌లైన 5 బయోస్ఫియర్లలో తమలపాకు, స్ట్రాబెర్రీ, చిక్కుడు, అల్లం, పాలకూర పంట వేశారు. సవోనా తీరంలో 10 నుంచి 36 అడుగుల కింద నీళ్లల్లో వీటిని నిర్మించారు. తగ్గిపోతున్న భూప్రాంతానికి ప్రత్యామ్నాయాలపై, వ్యవసాయానికి సవాలు విసిరే చోట్ల అనుసరించాల్సిన సేద్యపు పోకడలపై ఓ అంచనాకు వచ్చేందుకు వీటిని ఏర్పాటు చేశారు. నిరంతరం వీటిని పరిశీలిస్తున్న శాస్త్రవేత్తల బృందానికి ఆశించిన ఫలితాలే వస్తున్నాయి. గ్రీన్‌హౌస్‌లోని వాతావరణానికి ఆకర్షితమైన సముద్రజీవులు అక్కడ తల దాచుకుంటున్నా మొక్కల్ని మాత్రం పాడు చేయకపోవడం గమనార్హం. మనమూ భూమిని ఇలా పాడుచేయకుండా ఉంటే అక్కడ వరకు వెళ్లాల్సిన పరిస్థితి వచ్చేది కాదేమో.

పొలం పెయింటింగ్

వాన్‌గోగ్ 1889 కేన్వాస్‌పై సృజించిన అద్భుతం 'ఆలివ్ ట్రీస్' పెయింటింగ్. అదే అద్భుతాన్ని పొలంపై అచ్చు గుద్దేశాడు కేన్సాస్‌కు చెందిన ల్యాండ్‌స్కేప్ ఆర్టిస్ట్ స్టాన్ హెర్డ్. 1.2 ఎకరాల పొలాన్ని జాగ్రత్తగా కత్తిరించి 'ఆలివ్ ట్రీస్'ను చిత్రీకరించాడు. ప్రస్తుతం మిన్నెపోలిస్ ఆర్ట్ ఇన్‌స్టిట్యూట్‌లో వేలాడుతున్న ఆ పెయింటింగ్‌ను నేలపై పరచాలని ఆ కళా సంస్థే హెర్డ్‌ను కోరింది. తైలవర్ణచిత్రంలోని రంగుల్ని పోలేలా సుమారు ఆరునెలల కాలం పాటు కష్టించి రకరకాల గడ్డి మొక్కలను స్వయంగా పెంచాడు. ఆ తర్వాత వాటిని జాగ్రత్తగా కత్తిరించి, దగ్గరకు కట్టి ఈ అద్భుతాన్ని సృష్టించాడు. నేలపై నుంచి దీనిలోని విశేషమేమి అర్థంకాదు. ఆకాశం మీది నుంచే దాని చక్కదనం చూడగలం. సమీప విమానాశ్రయ ప్రయాణీకులకు గాల్లో పెయింటింగ్ ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేసినట్టయ్యింది.

నడిచే ఎక్స్‌రే

రష్యాకు చెందిన కుర్రాడు నికితా లెస్నోయ్‌కు ఇదేం పిచ్చో నడిచే ఎక్స్‌రేగా తన ముఖాన్ని మార్చేసుకున్నాడు. ముఖ భాగాన ఓ వైపు పుర్రె బయటకు వచ్చినట్టు టాట్టూ వేసుకున్నాడు. ముక్కు, కళ్లు బోలుగా కనిపించేలా నల్లటి రంగును.. పళ్లు, ఎముకలు పొడుచుకొచ్చినట్టుండేలా తెల్లటి రంగు వేసుకున్నాడు. ఇలా సగం పుర్రె టాట్టూతో తాను నివసించే క్రాస్నోయార్స్క్ నగరంలో తిరుగుతూ జనాల్ని హడలెత్తిస్తున్నాడు. మిగతా సగభాగాన్ని జోంబీలా కనిపించేలా టాట్టూ వేయించుకోవడానికి ఆర్టిస్టులను వెతుకుతున్నాడు. పుర్రె మొహమేసుకుని కనిపించిన కొడుకును చూసి భయపడ్డ తల్లి జోంబీ ముఖాన్ని ఎలా తట్టుకుంటుందో మరి.

చనిపోయిన కవితో...

- డా॥ దేవరాజు మహరాజు

నవ్వాలో ఏడవాలో నాకు తెలియలేదు
వాళ్ళంతా కూర్చుని నిలబడి
నీ గురించే మాట్లాడారు, చర్చించారు
అతను ఇక్కడే కూర్చున్నాడు
అతను ఇదే చేస్తుండే వాడు
ఇదిగో అతను చదువుకున్న పుస్తకం
ఇదే అతను నివసించిన గది
ఇవి అతని దృష్టినిచ్చిన కలాలు
అతను రాసుకున్న సు-లోచనాలు
అతను ఇంతటి వాడు అతను అంతటివాడు
ఆయన ఆలోచనలు అబ్బో అమోఘం!! ఇలా..
ప్రస్తుతం లోకి రండన్నట్లు
నీ కోడలు అందరికీ 'టీ' అందించింది
ఆ 'టీ'లో ఆత్మీయతా రుచి
బహుశా అది నీపై పెరుగుతున్న
గౌరవపు ఘుమ ఘుమ కావొచ్చు

❑ ❑ ❑

నేనక్కడే ఓ మూల కూర్చున్నాను
కూర్చునే ఉన్నాను ఏ మాత్రం కదల్లేదు
వాళ్ళు అలాగే మాట్లాడుతూనే ఉన్నారు నీ గురించి
నేను మాత్రం నిశ్శబ్ద శిలలా ఉండిపోయాను
నా దగ్గర మాటల మూటలు లేకపొయ్యాయి
రిక్తహస్తాలతో శూన్యపు దృక్కులతో
కాలపు నిశ్శబ్దంలో పాతిన
విగ్రహంలాగా, నిగ్రహంలాగా ఉండిపోయాను
ఓ రాయితో మాట్లాడినట్టు
వాళ్ళు నాతో మాట్లాడుతూనే ఉన్నారు
చనిపోయిన నీ గురించి, నీ ఔన్నత్యం గురించి
అకస్మాతుగా ఛాతిలో నా గుండే పెరిగినట్లయ్యింది
ఊపిరి భారమై పోయింది
నీ ముఖ మెప్పుడూ చూడని నేను
నిన్నిప్పుడు బాగా గుర్తు పట్టగలుగుతున్నాను
ఏదో ఎక్కడో కరుగుతున్నట్లు
సన్నటి అవ్యాజ్యమైన నీటి తెర
కళ్ళలో విస్తరించసాగింది
అదేమిటో, నీ కన్నా ఎక్కువ నాకెవరూ లేరన్నట్లు అనిపించసాగింది!!

◆ కథ

కుక్క చావు



మూలం: సాదత్ హసన్ మంటో

స్వేచ్ఛానువాదం: యాజీవ్

సైనికులు కందకాలలో కొన్ని వారాలుగా వున్నారు. ప్రతి రోజూ క్రమం తప్పకుండా జరుపుకునే కాల్పులు తప్ప పెద్దగా యుద్ధం ఏమీ లేదు. వాతావరణం చాలా ఆహ్లాదంగా వుంది. గాలిలో అడవి పూల సుగంధం మత్తుగా వుంది. బండలు, పొదల వెనక దాక్కున్న సైనికులను పట్టించుకోనట్టుగా ప్రకృతి తన మానాన తను వుంది. పక్షులు ఎప్పటిలాగే పాడుకుంటున్నాయి. పూలు వికసించాయి, బద్ధకంగా తుమ్మెదలు వాటి చుట్టూ ఝుమ్మంటూ తిరుగుతున్నాయి.

ఓ సంగీత వాద్యంలో ఏదో అపస్వరం పలికినట్టు హఠాత్తుగా వినిపించే తూటాల పేలుళ్ళ చప్పుడుకు పక్షులు ఉలిక్కి పడేవి. సెప్టెంబరు మాసం చివరికొస్తోంది. అంత వేడిగానూ లేదు. అంత చలిగానూ లేదు. వేసవి, శీతాకాలం రెండూ సంధి చేసుకున్నట్టు. నీలి ఆకాశంలో దూది పింజల్లాంటి మబ్బులు రోజంతా తేలుతూ సరస్సులోని పడవల్లా వున్నాయి. ఏమీ జరగని, ఎటూ తేలని ఈ యుద్ధంతో సైనికులు కూడా విసిగి పోయి వున్నట్టున్నారు. వారి స్థావరాలు అభేద్యమైనవి. దాదాపు సమాన ఎత్తులో వుండే రెండు గుట్టలపై ఎదురెదురుగా మొహరించి వున్నారు. దాంతో ఇద్దరిలో ఏ ఒక్క వైపు వారికి ప్రత్యేకమైన లాభం లేదు. ఆ లోయ కింద ఒక వాగు పాములా మెలికలు తిరుగుతూ పోతోంది.

ఈ యుద్ధంలో వాయు సేన పాల్గొనలేదు. పైగా ఇరు పక్షాలకి భారీ యుద్ధ సామగ్రి లేదు. రాత్రి వేళల్లో వాళ్ళు పెద్ద పెద్ద నెగళ్లు వెలిగించే వాళ్ళు. ఆ కొండల్లో వాళ్ళ స్వరాలే ప్రతిధ్వనించేవి.

అప్పుడే చివరి రౌండు టీ తీసుకున్నారు. నిప్పు చల్లారిపోయింది. ఆకాశం నిర్మలంగా వుంది, గాలిలో పైన్ చెట్ల నుండి వాసన ఘాటుగా వస్తోంది. చాలా మంది సైనికులు అప్పటికే నిద్రలో మునిగిపోయారు ఆ రాత్రి కాపలా డ్యూటీ చేస్తున్న జమాదార్ హర్నాం సింగ్ తప్ప. అతను కూడా రాత్రి రెండు గంటలకు గండా సింగ్‌ని లేపి డ్యూటీ అప్పచెప్పి నిద్రకు ఉపక్రమించాడు. కానీ, ఆకాశంలో నక్షత్రాలలాగా అతనికి నిద్ర చాలా దూరం లో వుంది. ఓ పంజాబీ జానపద గీతం అందుకున్నాడు.

ఒకరి తరువాత ఒకరిని అందరినీ లేపాడు. బాంటా సింగ్ అనే యువ సైనికుడు మధురమైన గొంతుతో హీర్ రాన్జా విషాద ప్రేమకథ నుండి ఒక పాట ఎత్తుకున్నాడు. ఆ గీతం అందరిలో విషాదాన్ని

నింపేసింది. ఆ కొండలు కూడా ఆ పాటతో ప్రభావితమైనట్టు కనిపించాయి. ఆ గంభీరమైన వాతావరణంలో ఒక కుక్క మొరగడంతో చెదిరి పోయింది. 'ఈ మాయదారి కుక్క ఎక్కడినుండి వచ్చింది?' విసుక్కున్నాడు జమాదార్ హర్నాం సింగ్.

ఆ కుక్క మళ్ళీ మొరిగింది. ఈసారి చాలా దగ్గరగా వినిపించింది. పొదల్లో కదలిక కనిపించింది. బాంటా సింగ్ లేచి ఆ వైపు వెళ్ళి, ఒక సాధారణ ఊర కుక్కతో వచ్చాడు. ఆ కుక్క తోక ఊపుతోంది. 'ఇది నాకు పొదల్లో దొరికింది. తన పేరు ఝున్ ఝున్ అని చెప్పింది', అన్నాడు బాంటా సింగ్. అందరూ నవ్వారు.

హర్నాంసింగ్ సంచిలో నుండి ఒక బిస్కట్ తీసి విసిరాడు. కుక్క దాన్ని వాసన చూసి తినే లోపు హర్నాం 'ఆగు, నువ్వు పాకిస్తానీ కుక్కవు కావచ్చు', అంటూ బిస్కట్‌ని లాగేసుకున్నాడు.

అందరూ నవ్వారు. బాంటా సింగ్ కుక్కను

సుబేదార్ తన తుపాకీ తీసి, గాలిలోకి కాల్చాడు.

ఇండియన్ లు ఆ కాల్పు విని కాస్త ఆశ్చర్యపడ్డారు. ఈ ఉదయపు సమయంలో ఇటువంటి సంఘటన అరుదు.

జమాదార్ హర్నాం సింగ్ 'మనం కూడా బదులు ఇద్దాం', అన్నాడు. రెండు పక్షాలూ అరగంట పాటు కాల్పులు జరుపుకున్నాయి. చివరికి హర్నాం సింగ్ చాలు అనుకొని ఆపాడు. అద్దంలో చూసుకుంటూ తన పొడవైన వెంట్రుకలు దువ్వుకుంటూ, బంటా సింగ్‌ని అడిగాడు, 'ఆ కుక్క ఝున్ ఝున్ ఎటు పోయింది?'

'కుక్కలు వెన్నను అరాయించుకోలేవు అని సామెత,' వేదాంత ధోరణిలో అన్నాడు బాంటా సింగ్.

హఠాత్తుగా పహారాలో ఉన్న సైనికుడు అరిచాడు, 'అదిగో వస్తోంది'.

'ఎవరు?', జమాదార్ హిమ్మత్ సింగ్ అడిగాడు.

'అదే, దాని పేరేంటి, ఝున్ ఝున్,' సమాధానమిచ్చాడు సైనికుడు.

'అదా, ఏం చేస్తోంది?' హర్నాం సింగ్ అడిగాడు.

'మన వైపే వస్తోంది', బైనాక్యులర్‌లో చూస్తూ అన్నాడు సైనికుడు.

సుబేదార్ హర్నాం సింగ్ బైనాక్యులర్‌ని లాక్కుని, 'అదే, దాని మెడలో ఏదో వుందే...అది పాకిస్తానీ కొండ మీద నుండి వస్తోంది కదా.

అతను తుపాకీ ఎక్కుపెట్టి కాల్చాడు. తూటా కుక్క పక్కనే ఉన్న బండకి తగిలింది. కుక్క నిలబడి పోయింది.

సుబేదార్ హిమ్మత్ ఖాన్ అది విని, బైనాక్యులర్‌లో నుండి చూసాడు. కుక్క వెనక్కు తిరిగి పరిగెత్తుకు రాసాగింది. 'వీరులు యుద్ధంలో వెన్ను చూపరు. వెనక్కి వెళ్లి నీ బాధ్యత నిర్వర్తించు' కుక్కపై అరిచాడు.

దాన్ని బెదిరించడానికి కాల్చాడు. అదే సమయంలో హర్నాం సింగ్ కూడా తుపాకీ పేల్చాడు. ఆ తూటా దాని పక్కన వెంట్రుక వాసి నుండి దూసుకు పోయింది. కుక్క గాల్లోకి ఎగిరింది. సుబేదార్ హిమ్మత్ ఖాన్ మళ్లీ కాల్చాడు.

కాల్పులూ... కుక్క అక్కడక్కడే ప్రాణ భయంతో తిరగడం... చూస్తుండగానే ఇద్దరు సైనికుల మధ్య అది ఒక ఆటలా మారింది.

హిమ్మత్ ఖాన్, హర్నాం సింగ్ ఇద్దరూ వికృతంగా నవ్వుతున్నారు. కుక్క హర్నాం సింగ్ వైపు పరిగెత్తింది. అతను దాన్ని గట్టిగా తిడుతూ కాల్చాడు. ఈ సారి గుండు దాని కాలికి తగిలింది. అది మూలిగి, వెనక్కు తిరిగి, హిమ్మత్ ఖాన్ వైపు పరిగెత్తింది. అతను దాన్ని భయ పెట్టడానికి కాలుస్తూనే వున్నాడు, 'ధైర్యంగా వుండు. గాయాలని నీ బాధ్యతకు అడ్డు రానీకు. వెళ్ళు, వెళ్ళు,' అరుస్తున్నాడు పాకిస్తానీ.

కుక్క వెనక్కు తిరిగింది. ఒక కాలు పనికి రాకుండా పోయింది. హర్నాం సింగ్ వైపు ఈడ్చుకుంటూ వస్తోంది. అతను తుపాకి ఎక్కుపెట్టి, గురి చూసి, కాల్చాడు. అది చనిపోయింది.

'పాపం, పిచ్చిది వీర మరణం పొందింది', సుబేదార్ హిమ్మత్ ఖాన్ నిట్టూర్చాడు.

జమాద్ హిమ్మత్ సింగ్ ఇంకా వేడిగా వున్నా తుపాకీ గొట్టాన్ని నిమురుతూ గొణిగాడు, 'కుక్క చావు చచ్చింది.'

✦

బడికి ఈత బాట

ఉపాధ్యాయుడంటే కేవలం పుస్తకాల్లోని పాఠాలకే పరిమితమయ్యే వ్యక్తి కాదు. విద్యార్థుల జీవితాల్ని మలుపు తిప్పే శక్తి. వారి భవితకు బంగారు బాట వేసేందుకు ఎన్నో తంటాలు పడుతుంటాడు. ఆ చిన్ని బుర్రల్లోకి కష్టమైన పాఠాల్ని ఎక్కించేందుకు ఎన్నెన్నో పిట్ట కథల్ని అల్లేస్తాడు. ఎంతో మంది ఆదర్శ గురువుల్ని, ఉత్తమ ఉపాధ్యాయుల్ని ఎరిగి ఉంటాం. పిల్లలకు నాలుగు అక్షరం ముక్కలు నేర్పడానికి ఈ మాస్టారు పడే తపన కాస్త విలక్షణం. కేరళ మలాప్పురంలోని పాడింజట్టుమూరి ముస్లిం ప్రాథమిక బడికి చెందిన ఎ.టి. అబ్దుల్ మాలిక్ అనే అధ్యాపకుడు బడికి చేరేందుకు ఈత కొట్టి నది దాటుతారు. 19 ఏళ్లుగా ఇలా ప్రతిరోజు తన గ్రామం నుంచి పక్క గ్రామంలోని బడికి చేరేవారు. ఆ ఊరిని చేరేందుకు పడవలు ఉండేవి కావు. చుట్టూ ఊళ్లన్నీ తిరిగి అక్కడకు చేరుకోవాల్సి వచ్చేది. రోజు కొన్ని గంటల పాటు సమయం వృథా అవడమే కాక బస్సులు, ఆటోలు కూడా సరిగా తిరిగేవి కావు. అందుకే ఆయన ఈ మార్గాన్ని ఎంచుకున్నాడు. సరిగ్గా 9 గంటల కల్లా నదిని దాటడానికి ఒడ్డుకు వస్తాడీ మాస్టారు. ఆయన్ను చూసే ఊరిలోని వారు సమయం తెలుసుకునేవారంటే ఆశ్చర్యం లేదు. కాదలుండిపుజా నదిని దాటగానే పొడి బట్టలను మార్చుకుంటారు. పెన్నులు, పుస్తకాలు, ఫోన్ పాడవకుండా జాగ్రత్తగా ప్లాస్టిక్ సంచిలో వేసి తీసుకెళతారు. అబ్దుల్ మాలిక్ సాహస ప్రయాణాన్ని గురించి విన్న ఇంగ్లండ్‌కు చెందిన ఓ మానసిక వైద్యుడు తేలికపాటి ఫైబర్ గ్లాస్ పడవను బహుమతిగా పంపాడు. ప్రస్తుతం దానిలో బడికి వెళుతున్నా అప్పుడప్పుడు ఈతనే ఎంచుకుంటారు. ఎందుకంటే చక్కటి వ్యాయామమే కాక ప్రకృతితో మమేకమైనట్టు ఉంటుందనేది ఆయన భావం. ఆయన ప్రకృతి ప్రేమికుడు. కాదలుండిపుజా నదిని, దాని చుట్టుపక్కల పరుచుకున్న అందమైన ప్రకృతిని పరిరక్షించేందుకు కార్యక్రమాలు కూడా నిర్వహిస్తుంటాడు. పిల్లలకు ఈతలో శిక్షణనిచ్చే ఈ మాస్టర్ ఇప్పటి వరకు 700 కిలోమీటర్ల దూరం ఈత కొట్టాడు. ఇది ఫ్రాన్స్ ఇంగ్లండ్‌లను మధ్య పారే ఇంగ్లీష్ చానల్ అంత ఉంటుంది.

✦

నిమిరి, 'జమాదార్ సాబ్, ఝున్ ఝున్ భారతీయ కుక్క', అన్నాడు. 'ఏయ్, చెప్పు నువ్వెవరో' అని ఆజ్ఞాపించగానే కుక్క తోక ఊపడం మొదలెట్టింది.

'ఇది గుర్తింపు కాదు. కుక్కలన్నీ తోక వూపగలవు', అన్నాడు హర్నాం సింగ్.

'ఇది పాపం శరణార్థి', దాని తోకతో ఆడుతూ అన్నాడు బాంటా సింగ్.

హర్నాం సింగ్ బిస్కట్‌ను గాలిలోకి విసిరాడు. కుక్క దాన్ని గాలిలోనే అందుకుంది.

'చివరికి కుక్కలు కూడా తాము పాకిస్తానో ఇండియానో నిర్ణయించుకోవాలి' అన్నాడు ఒక సైనికుడు.హర్నాం సంచిలో నుండి ఒక బిస్కట్‌ని తీసాడు. 'పాకిస్తానీయులందరూ...కుక్కలు సహా... కాల్చివేయబడతారు'.

'ఇండియా జిందాబాద్' ...అరిచాడో



సైనికుడు.

ఆ కుక్క బిస్కట్‌ను తినబోతూ తినబోతూ, తోక కాళ్ళ సందులోకి ముడుచుకుని, చేష్టలుడిగి, భయంగా చూస్తూ ఉండిపోయింది. హర్నాం బిగ్గరగా నవ్వాడు, 'నీ సొంత దేశమంటే భయమెందుకు? ఇదిగో, ఇంకో బిస్కట్ తిను'.

చీకటి గదిలో ఎవరో లైటు వేసినట్టు ఆకస్మాత్తుగా తెల్లారిపోయింది. తిత్వాల్ అనే ఆ ప్రాంతం కొండల్లో, లోయల్లో వెలుతురు పరుచుకుంది.

నెలల తరబడి యుద్ధం జరుగుతున్నా, ఎవరు గెలుస్తారో ఎవరికీ తెలియని పరిస్థితి. జమాదార్ హర్నాం సింగ్ బైనాక్యులర్స్‌తో చుట్టూ పరిశీలించాడు. ఎదురుగా వున్న గుట్ట పైనుండి పొగ రావడం కనిపించింది. అంటే, తమ లాగే శత్రువు కూడా ఫలహారం తయారు చేసుకుంటున్నాడన్నమాట.

పాకిస్తాన్ సైన్యంలో సుబేదార్ హిమ్మత్ ఖాన్ తన దట్టమైన మీసాన్ని మెలివేసి, తిత్వాల్ సెక్టార్ పటం పరీక్షగా చూస్తున్నాడు. అతని పక్కనే వైర్లెస్ ఆపరేటర్ ప్లాటూన్ కమాండర్‌తో సంబంధం ఏర్పరుచుకునే ప్రయత్నం చేస్తున్నాడు.

కొన్ని అడుగుల దూరంలో ఒక బండకు వీపు పెట్టి, ఎదురుగా తుపాకీ పెట్టి బషీర్ అనే సైనికుడు కూర్చుని వున్నాడు. అతను కూని రాగం తీస్తున్నాడు: 'రాత్రి ఎక్కడ గడిపావే....నా చందా మామా....నా ప్రియతమా...రాత్రి ఎక్కడ గడిపావే...'

తన పాటకి తనే మైమరిచి పోయి, ఇంకా గట్టిగా పాడటం మొదలెట్టాడు. అంతలో, సుబేదార్ హిమ్మత్ ఖాన్ అరుపు వినబడింది, 'రాత్రి ఎక్కడ గడిపావు?'

కానీ అది తనని ఉద్దేశించి కాదు. సుబేదార్ అరుస్తున్నది ఒక కుక్క పైన. అది కొన్ని రోజుల క్రితం ఇక్కడి నుండి వెళ్ళిపోయింది. కానీ ఇప్పుడు తిరిగి వచ్చింది.

బషీర్ నవ్వుతూ పాడసాగాడు, "రాత్రి ఎక్కడ గడిపావు? 'రాత్రి ఎక్కడ గడిపావు?' కుక్క తోక వూపింది. సుబేదార్ హిమ్మత్ ఖాన్ దాని పైకి ఒక రాయి విసిరాడు, 'పనికిమాలినది. తోక ఊపడం మాత్రం తెలుసు'.

'దాని మెడలో ఏంటి?' అడిగాడు బషీర్.

ఒక సైనికుడు కుక్కను పట్టుకుని, దాని మెడలో తాడు విప్పేశాడు. దానికి ఒక అట్ట ముక్క కట్టి వుంది. 'ఏం రాసి వుంది'? చదువు రాని ఆ సైనికుడు అడిగాడు.

బషీర్ ఆ అట్టను తీసుకుని, కష్టపడి చదివాడు, 'ఝున్ ఝున్'.

సుబేదార్ హిమ్మత్ ఖాన్ తన మీసాన్ని మరింత గట్టిగా మెలితిప్పి, 'బహుశా ఇది రహస్య సంకేతం అయి వుంటుంది. ఇంకా ఏమైనా ఉందా, బషీర్?'

'సర్, ఇది భారతీయ కుక్క అని వుంది'.

'అంటే ఏమిటి?' హిమ్మత్ ఖాన్ అడిగాడు.

'రహస్యమేమో', చాలా గంభీరంగా అన్నాడు బషీర్.

'ఒక వేళ అది రహస్యం అయితే, అది ఝున్ ఝున్ అనే మాట లోనే వుంది' మరో సైనికుడు చీకట్లో రాయి విసిరాడు.

'ఏదో వుండే వుంటుంది', అన్నాడు సుబేదార్ హిమ్మత్ ఖాన్ దీర్ఘంగా ఆలోచిస్తూ.

బషీర్ మరోసారి చదివాడు, 'ఝున్ ఝున్, ఇది భారతీయ కుక్క.'

సుబేదార్ హిమ్మత్ ఖాన్ వైర్లెస్ సెట్ తీసుకుని ప్లాటూన్ కమాండర్‌తో మాట్లాడాడు. కుక్క ఆకస్మాత్తుగా తమ స్థావరం లోకి రావడం, అంతే ఆకస్మాత్తుగా గత రాత్రి మాయమైపోవడం, మళ్ళీ పొద్దున్నే కనిపించడం గురించి వివరంగా చెప్పాడు.

'ఏం మాట్లాడుతున్నావు?', కమాండర్ అడిగాడు.

సుబేదార్ హిమ్మత్ ఖాన్ మరో సారి పటం చూసాడు. జేబులో నుండి సిగరెట్ ప్యాకెట్ తీసి, దాన్ని చించి ఒక ముక్కని బషీర్‌కి ఇచ్చాడు. 'సిక్కుల భాష గుర్ముఖిలో వ్రాయి'....

'ఏం రాయాలి?'

బషీర్‌కి ఏదో తట్టింది. 'ఘున్ ఘున్. ఝున్ ఝున్ కి జవాబు ఘున్ ఘున్'.

'శభాష్', సుబేదార్ హిమ్మత్ ఖాన్ అంగీకారంగా తల ఊపాడు.

'ఇది పాకిస్తానీ కుక్క అని కూడా రాయి.'

రాసిన అట్ట ముక్కను కుక్క మెడకు తగిలించి, 'వెళ్ళు, నీ కుటుంబాన్ని కలుసుకో', అన్నాడు సుబేదార్.దానికి తినడానికి పెట్టి, 'చూడు మిత్రమా, ద్రోహం చేయకూడదు. ద్రోహానికి శిక్ష మరణమే.'

కుక్క పెట్టింది తింటూ, తోక వూపసాగింది. సుబేదార్ హిమ్మత్ ఖాన్ ఎదురుగా వున్న కొండ వైపు చూసి, 'ఈ సందేశాన్ని శత్రువుకి అందించు, కానీ తిరిగి రా. ఇది నీ కమాండర్ ఆర్డర్.'

కుక్క తోక ఊపుతూ కొండ కిందకు దిగిపోయింది.

శనగ దోశ

కావాల్సిన పదార్థాలు

బియ్యం-ఒక కప్పు

మినప్పప్పు-ఒక కప్పు, శనగపప్పు-ఒక కప్పు, ఉప్పు-తగినంత, నూనె-సరిపడా

తయారీ

బియ్యం, మినప్పప్పు, శనగపప్పు మూడింటిని శుభ్రంగా కడిగి గోరు వెచ్చని నీటిలో మూడు గంటలు నానబెట్టాలి. వీటిని శుభ్రంగా కడిగి అవసరమైన నీటిని ఉపయోగించి మెత్తని పిండిగా గ్రైండ్ చేయాలి. రాత్రంతా కదపకుండా అలా ఉంచాలి. మరుసటి రోజు ఉదయం పిండిలో ఉప్పు, సరిపడా నీటిని పోసి కలపాలి. ఈ పిండితో పెనం మీద దోశలు వేసుకుని రెండు వైపుల గోల్డ్ కలర్ వచ్చే వరకు కాల్చాలి.

పెరుగు దోశ

కావాల్సిన పదార్థాలు

బియ్యం-రెండు కప్పులు, మినప్పప్పు-1/4 కప్పు, మెంతులు-ఒక టేబుల్ స్పూన్, పెరుగు-ఒక కప్పు, ఉప్పు-రుచికి సరిపడా, సోడా-1/2 టీ స్పూన్

తయారీ

బియ్యం, మెంతులు కలిపి నానబెట్టాలి. మినప్పప్పును కూడా నానబెట్టాలి. బియ్యం, మెంతులు, మినప్పప్పు మెత్తగా మిక్సీలో చేసుకోవాలి. దీనికి పెరుగు కలిపి రాత్రంతా అలా కదపకుండా ఉంచాలి. మరుసటి రోజు ఉదయం ఈ పిండిలో బేకింగ్ సోడా, ఉప్పు కలిపి దోశలు వేసుకోవాలి.

స్టీం దోశ

(నూనె లేకుండా మూత పెట్టి ఆవిరిపై ఉడికించి చేసుకునే దోశ స్టీం దోశ)

కావాల్సిన పదార్థాలు

ఉప్పుడు బియ్యం- ఒక కప్పు, అటుకులు-ముప్పావు కప్పు, మెంతులు -అర టీస్పూను, పుల్లటి మజ్జిగ-రెండు కప్పులు.

తయారీ

బియ్యం, అటుకులు, మెంతులను ఒక గిన్నెలో ఆరుగంటలు నానబెట్టి మజ్జిగను కలుపుకుంటూ మెత్తగా రుబ్బుకోవాలి. ఈ పిండితో పెనంపై వెంటనే దోశ వేసుకోవచ్చు. అయితే కొద్దిగా మందంగా దోశ వేసుకొని మూత పెట్టాలి. మధ్య మధ్యలో మూత తీసి చూస్తూ ఉండాలి. వేలికి పిండి అంటలేదు అనిపించేదాక ఉంచితీసేయాలి. వెనుక వైపు కాల్చకూడదు. మెత్తగా స్పాంజిలా ఉండే దోశ రెడీ. దీనిపై క్యారెట్, బీట్ రూట్ కూరముక్కలతో అలంకరించుకుంటే ఎంతో రుచికరంగా ఉంటుంది.

పుదీన దోశ

కావాల్సిన పదార్థాలు

బియ్యం-రెండు కప్పులు, పెసరట్టతో మినపప్పు, శనగపప్పు, కందిపప్పు-పావు కప్పు చొప్పున (గింజలు తీసిన) ఎండు మిర్చి-రెండు, రవ్వ -పావు కప్పు, ఇంగువ- అర టీ స్పూను, దోసకాయ తరుగు- ఒక కప్పు, పుదీనా తరుగు-ఒక కప్పు, ఉప్పు- రుచికి తగినంత, నూనె-కాల్చడానికి సరిపడా

తయారీ

బియ్యంతో పాటు పప్పులు,రవ్వకి కలిపి మూడు గంటలు నానబెట్టాలి. మిక్సీలో ఎండు మిర్చి పొడి చేసుకుని నానిన దినుసులు పుదీనా ఆకులు వేసి, అవి మెత్తబడ్డాక ఇంగువ, ఉప్పు, దోసముక్కలు వేసి రుబ్బుకోవాలి. అవసరమైతే నీరు కలుపుకోవచ్చు. తర్వాత దోశల్లా పోసుకోవాలి. పుదీనా దోశల్లోకి కొబ్బరి చట్నీ చాలా బాగుంటుంది.

పన్నీరు దోశ

కావాల్సిన పదార్థాలు

దోశపిండి-నాలుగు కప్పులు, పనీర్-200 గ్రా, ఉల్లిపాయ-100 గ్రా, టమోటా-ఒక కప్పు, పచ్చిమిర్చి-నాలుగు, కొత్తిమీర ఆకులు-ఒక స్పూన్, ఉప్పు-రుచికి సరిపడా

తయారీ

పన్నీర్‌ను తురుముగా చేసుకోవాలి. ఉల్లిపాయలు, కొత్తిమీర, పచ్చి మిర్చి టమోటాలను సన్నని ముక్కలుగా కోయాలి. ఒక పాన్‌లో నూనె వేసి వేడెక్కాక ఉల్లిపాయ ముక్కలు, పచ్చిమిర్చి ముక్కలు వేసి రెండు నిమిషాలు వేగించాలి.ఆ తర్వాత టమోటా ముక్కలు, ఉప్పు వేయాలి. ఆ తర్వాత తురిమిన పన్నీర్‌ను వేసి పొయ్యి ఆఫ్ చేయాలి. ఆ తర్వాత మసాలా, కొత్తిమీర వేసి బాగా కలపాలి.

పొయ్యి మీద పాన్ పెట్టి నూనె వేసి పిండితో దోశ వేసి, దోశ మధ్యలో పనీర్ మసాలా ఒక స్కూప్ పెట్టాలి. దోశ సిద్ధం అయ్యాక సర్వింగ్ ప్లేట్‌లోకి తీసుకోవాలి. కొబ్బరి పచ్చడి లేదా టమోటా సాస్‌తో వేడి వేడిగా సర్వ్ చేయండి.

నీడ

చేతి వేళ్లను మడిచి వాటి నీడతో ఏదో జంతువును చూపిస్తున్నాడు ఆర్టిస్ట్ అంకుల్. దాన్ని గుర్తు పట్టారా. అయితే మీరు అలా ఓ సారి ప్రయత్నించండి.

దారి కనుక్కోండి



ఆ రెండు ఏవి?

ఈ విచిత్ర జీవిలో మొత్తం రెండు జంతువుల శరీర భాగాలున్నాయి. అవి ఏవో గుర్తించండి.

బుజ్జి స్టార్

ఈ ఫొటోలో వున్న బాలనటి ఎవరో చెప్పుకోండి. ఇప్పుడు హీరోయిన్ అనుకోండి.

ఎక్కడున్నాయి

ఈ చిత్రంలో బోలెడన్ని వస్తువులు దాగి ఉన్నాయి. పక్కన నిలువు బాక్సులో ఇచ్చిన 10 బొమ్మలు ఈ చిత్రంలో ఎక్కడెక్కడ దాగున్నాయో గుర్తించండి.

పదాలు పూరించండి

కింద కొన్ని పదాలు ఉన్నాయి. కాకపోతే మిస్సయిన అక్షరం రాస్తేనే వాటికి అసలు రూపం వస్తుంది.

1. __and
2. __hin
3. __hat
4. s__in
5. __un
6. f__n
7. __t
8. c__t
9. s__t
10. s__t

ఆకులతో స్కూటర్

చింటూ కొన్ని ఆకులు ఏరుకొచ్చి వాటిని స్కూటర్ ఆకారంలో అతికించేశాడు, మరి మీరూ ఇలానే చేస్తారు కదూ.

జవాబులు:

ఆ రెండు ఏవి : పిల్లి,నత్త

బుజ్జిస్టార్ : షామిలి

పదాలు పూరించండి:

h,c,t,k,f,a,a,a,i,e

నీడ: మేక

తమాషా ప్రశ్నలు

1)ఎగ్జామినర్ దిద్దని పేపరు ఏమిటి?

2) ఆయుధం లేని పోరాటం ఏమిటి?

జవాబులు : న్యూస్ పేపరు,మౌన పోరాటం

పిల్లి ఫీట్లు



ప్రమాదవశాత్తు ఎత్తయిన చోటు నుంచి కిందపడ్డామనుకోండి. కాలో, చెయ్యో విరగొచ్చు. ఒక్కోసారి ప్రాణంమీదకి కూడా వస్తుంది. మిగతా జంతువుల పరిస్థితీ ఇంతే. అయితే, పిల్లి అలా కాదు. అది ఎంత ఎత్తు నుంచి పడ్డా సరే. కింద దర్జాగా నాలుగు కాళ్ళమీద నిలబడగలదు. దానికి ఏ మాత్రం దెబ్బ తగలదు. హాయిగా నడుచుకుంటూ వెళు తుంది. చూడ్డానికి వింతగా అనిపిస్తుంది. ఆశ్చర్యంగా ఉన్నా ఇది నిజం. పిల్లిలో ఉన్న అరుదైన అత్యంత శక్తివంతమైన స్పర్శజ్ఞానమే దీనికి కారణం. కింద పడుతున్నామని తెలియగానే, అది హెచ్చరించి శరీరాన్నంతటినీ అందుకు రెడీ చేస్తుంది. అదీ అసలు సంగతి.

ఎన్ని ఉన్నాయి

ఇక్కడ కొమ్మలో దాక్కుని జంతువులు కనిపిస్తున్నాయి కదూ. ఇంతకీ మొత్తం ఎన్ని జంతువులు? వాటి పేర్లేంటి?

ఆదిరాజు వీరభద్రరావు జీవితం - భాషా సేవ

తెలంగాణ చరిత్రను గూర్చి సాధికారికంగా తెల్సుకోవాలంటే ఆదిరాజు వారి "మన తెలంగాణము" చదవాలి. నైజాం పాలనకు వ్యతిరేకంగా ప్రజల్ని సమీకరించే (విజ్ఞాన చైతన్యం ద్వారా) కృషి చేసిన వారిలో అగ్ర గణ్యులు ఆదిరాజు వీరభద్ర రావు గారు. 16-11-1890లో పుట్టి 28-9-1973లో కీర్తిశేషులైన ఆదిరాజు వీర భద్రరావు గారు సాహితీ సాంస్కృతిక, గ్రంథాలయోద్యమ, వయోజన విద్య, భాషాసేవ, సాంఘీక సేవా ఉద్యమాలు, రావి చెట్టు రంగా రావు గారి వద్ద పెరిగిన స్థితి, ఈ గ్రంథంలో రేఖా మాత్రంగా తెలుస్తుంది. కొమర్రాజు వెంకట లక్ష్మణరావు, రావి చెట్టు రంగారావు, మునగాల రాజా కలిసి 1901 సంవత్సరంలో శ్రీకృష్ణ దేవరాయాంధ్ర భాషా నిలయం స్థాపించడం, భాషానిలయానికి వీరభద్రరావు గారు లైబ్రేరియన్‌గా పనిచేయడం, ఆ తరువాత ఉపాధ్యాయ వృత్తిలో పనిచేయడం, అనంతరం సుజాత, గోల్కొండ పత్రికల్లో పని చేయడం లాంటి ఎన్నో జీవిత ముఖ్య ఘట్టాలు ఈ పుస్తకంలో రాశారు. జీవిత చరితావళి, హాస్య రచనలు, బాల సాహిత్యం, పరిశోధనాత్మక వ్యాసాలు, పరిశీలనాత్మక, విమర్శనాత్మక రచనలు, జేమ్స్ గార్ఫీల్డు కథ, చైతన్య మహాప్రభు చరిత్ర రచనలు ఎంతో విలువైనవి. ఆదిరాజు వారు సంపాదకత్వం వహించిన సంపుటాలు, ఆకాశవాణి ప్రసంగాలు, వివరాలు మొదలైనవి ఈ పుస్తక ప్రాధాన్యతకు నిండుతనం కల్గించాయి. తెలంగాణలో ఆదిరాజు వీర భద్రరావు గారి భాషా సాహిత్య సాంస్కృతిక సామాజిక సేవ, మొదలైన అంశాల్ని ప్రాథమిక పరిశీలనకు ఉపకరించే ఉపయుక్త గ్రంథం ఇది.

-తంగిరాల చక్రవర్తి

ఆదిరాజు వీరభద్రరావు జీవితం - భాషా సేవ, రచన: గడియారం రామకృష్ణ శర్మ, డా॥ బిరుదు రాజు రామరాజు, పేజీలు: 56/-, వెల: 40/-, ప్రతులకు: నవ చేతన పబ్లిషింగ్ హౌస్, జి.ఎస్.ఐ - హైదరాబాదు-068, ఫోన్: 24224453. మరియు విశాలాంధ్ర బుక్‌హౌసు అన్ని బ్రాంచీలు.



అక్కినేని సమగ్ర దర్శనం

అక్కినేని నాగేశ్వరరావు కొన్ని తరాల తెలుగువారికి ప్రియతమ నటుడు. ఆయన సినిమాలకూ జీవితానికి సంబంధించిన చాలా అంశాలు కళాభిమానులకు కంఠోపాఠం. అయినా కడలి లోతుల్లోకి వెళుతున్న నూతన విషయాలు తెలుస్తున్నట్టే అలాంటి వారి జీవితానుభవాల్లోనూ ఎన్నెన్నో తెలియని పార్శ్వాలుంటాయి. అందులోనూ ఏడు దశాబ్దాల నటజీవితం, 200 పైగా చిత్రాలు, చిత్ర నిర్మాణం స్టూడియో స్థాపన, తన తర్వాతి రెండు తరాల లోనూ కథానాయకులను అందించడం అక్కినేని ప్రత్యేకత.ఈ సుదీర్ఘ జీవన యానంలో ఆయనను ప్రభావితం చేసిన వారూ ఆయన ప్రభావంతో ప్రేరితులైన వారు ఎందరెందరో. ఇవన్నీ వివిధ రూపాల్లో సందర్భాల్లో పత్రికల్లోనూ పుస్తక రూపంలోనూ వచ్చి వుండొచ్చు. కాని వాటన్నిటినీ కలగలిపి ఒక ఏకసూత్ర రచన అందించాలన్న ఆలోచన కలిగింది సీనియర్ పాత్రికేయులు గోవిందరాజుల చక్రధర్‌కు. మౌలికంగా సినిమా హీరో కథ కాబట్టి అసలు సినిమా పుట్టుక భారతీయ సినిమాల ఆరంభ సంరంభం వంటి అంశాల క్రోడీకరణతో మొదలవుతుంది. తర్వాత కృష్ణాజిల్లా గుడివాడ సమీపంలోని వెంకట రాఘవాపురంలో అక్కినేని పుట్టుక, తల్లి పున్నమ్మ పెంపకం, నాటకాలలో ఆయన రాణించడం, ఘంటసాల బలరామయ్య సినిమాల్లోకి తీసుకుపోవడం తదితర ఘట్టాలు వివరంగా పొందుపర్చారు. సినిమా జీవితంలో తొలి అడుగులు, దీర్ఘ కాల దృష్టితో నిలదొక్కుకోవడానికి అప్పుడే అక్కినేని తీసుకున్న జాగ్రత్తలు ఇవన్నీ విశ్లేషించారు. ఆయన 'జీవితమే వ్యక్తిత్వ వికాస గ్రంథం' అని పేరు పెట్టారు గనక ఇవన్నీ ఇవ్వడం సముచితంగానే వుంది. అక్కినేని పదే పదే చెప్పినట్టు ఆ రోజుల్లో సినిమా వారంటే పెద్దగా సదభిప్రాయం లేదు.అయినా తల్లి ఎపున్నమ్మ ధైర్యంగా ప్రోత్సహించింది. దుక్కిపాటి మధుసూదనరావు వంటివారు కొండంత అండగా నిలిచారు. సినిమా జీవితంలో ప్రాథమికంగా విజయవంతమైనాక అన్నపూర్ణను పెళ్లి చేసుకోవడం, అత్తింటివారి చిన్నచూపు వంటి పరిణామాలు ఆయనలో పట్టుదలను మరింత పెంచాయి. తనకన్నా అందగాడూ గంభీర కంఠస్వరం గల ఎన్టీఆర్ రంగ ప్రవేశం ఆయన నట జీవితానికి సవాలుగానే తయారైంది. ఆ పోటీని తట్టుకొని తన స్థానాన్ని కాపాడుకోవడానికి ఆ దశలో ఎంపికలోనూ నటనలోనూ మరింత కష్టపడాల్సి వచ్చింది.ఈ పోటీని ఇద్దరి ప్రత్యేకతలనూ కూడా చక్రధర్ బాగా విశ్లేషించడమే గాక వారి విభేదాల నేపథ్యంపై గుమ్మడి వంటివారి జ్ఞాపకాలను కూడా జోడించి ఒక అవగాహన కలిగించేందుకు ప్రయత్నించారు. అక్కినేని జీవితంలోనూ చాలా పరీక్షలు ఎదుర్కొన్నారు. ఒకసారి రోడ్డు ప్రమాదంలో తోటివారు మరణించినా బతికి బయిట పడ్డారు.మరోసారి స్ఫోటకపు మచ్చలువస్తే తనతో సినిమాలు తీస్తున్న వారు నష్టపోతారని చాలా కష్టతరమైన చికిత్స చేయించుకుని వాటిని లేకుండా చేసుకున్నారు. వయస్సు పెరిగాక గుండె చికిత్స అవసరమైతే చేయించుకుని ఆ పైన స్టూడియో నిర్మించి మరిన్ని చిత్రాల్లో నటించి విజయం సాధించారు. హైదరాబాదుకు చిత్ర పరిశ్రమ తరలి రావడంలో ముందు భాగాన నిలిచారు. శాంత కుమారి నుంచి జయసుధ వరకూ ఎందరో కథానాయికలు ఆయనతో నటించి రాణించారు. వారిలోనూ సావిత్రి, వాణి శ్రీ వంటివారు ప్రత్యేక ముద్ర వేశారు. దర్శకు లుగా నాటి రామబ్రహ్మం మొదలు నిన్న మొన్నటి యువ దర్శకుల వరకూ వున్నారు. ఆదుర్తి సుబ్బారావు, ఆత్రేయ, ఘంటసాల తనకు ప్రత్యే కంగా ఆత్మీయులని తన విజయాలలో సగం వారికి చెందుతుందని ఆయన అంటుండేవారు. అలాటి వారి అనుభవాలు అభిప్రాయాలు జ్ఞాప కాలు ఈ పుస్తకంలో చూడొచ్చు. అలాగే భార్య అన్నపూర్ణ కుమారులు మనవల అనుభవాలు కూడా పొందుపర్చారు. నిజం చెప్పాలంటే ఇదొక్క పుస్తకం కాదు- అనేక పుస్తకాల సమాహారం. ఎందుకంటే ఇందులో భావాలు పంచుకున్న ప్రతి ఒక్కరూ పుస్తక రచనలో భాగం పంచుకున్నట్టే చెప్పాలి. ఇన్ని కలగలసిన కారణంగా కొంత పునరుక్తి వుందనిపించినా ఆసక్తిని తగ్గించదు. రంగుల బొమ్మలు కొన్ని అరుదైన చిత్రాలు ఆకర్షణగా చెప్పాలి.

-పీపీ



అక్కినేని నాగేశ్వరరావు- జీవితమే వ్యక్తిత్వ వికాస గ్రంథం, గోవిందరాజు చక్రధర్, ధర: రు.300/- ప్రతులకు: అన్ని ప్రముఖ పుస్తకాలయాలు.

బొమ్మల దీవి

మెక్సికోలోని తేలియాడే ఉద్యానవనాలను జోచినిల్కో కాలువల్లో కదలాడే చిన్నచిన్న ద్వీపాలపై ఆజ్‌టెక్‌లు పెంచారు. అదంతా చరిత్ర. ఇపుడు ఇదే ద్వీప సముదాయంలోని ఓ చినెర్పొ దీవి బొమ్మల ద్వీపంగా పేరు తెచ్చుకుంది. హారర్ కథల వాతావరణంతో సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. తెగిపోయిన, విరిగిపోయిన బొమ్మలు అక్కడి అడవంతా చెట్లపై, తీగెలపై, తోవ పక్కన, రాళ్ల కింద పేర్చి ఉంటాయి. రైతు, దీవి యజమాని డాన్ జులియన్ సాంతానా బార్రెరానే ఇలా ఈ బొమ్మల్ని దీవంతా నింపేశాడు. 1950లలో ఎవరో చిన్నారి మృతదేహం తన దీవికి కాలువలో కొట్టుకొచ్చిందని జులియన్ చెబుతుండేవాడు. ఆ పాప జ్ఞాపకార్థం బొమ్మల్ని సేకరించి దీవిలో పెట్టేవాడు. కానీ, పాప మృతదేహం లభించలేదు. అదంతా జులియన్ భ్రమ అని ఆధారాలతో తేల్చేశారు. కానీ, జులియన్ మాత్రం చనిపోయేంత వరకు ఈ పని పిచ్చిపట్టినట్టు చేస్తూనే ఉండేవాడు. సుమారు 1500 బొమ్మల్ని జులియన్ సేకరించి ఇక్కడ పేర్చాడు. 2001లో గుండెనొప్పితో చనిపోయాడు. జులియన్ బంధువు అనాస్టాసియో ఇప్పుడా దీవి వ్యవహారాన్ని చూస్తున్నాడు. మెక్సికో నగరం నుంచి రెండు గంటల కాలువ ప్రయాణంలో అక్కడకు చేరుకోవచ్చు. దీవి అనుభూతి ఎలా ఉన్నా ప్రయాణం మాత్రం చాలా ఆహ్లాదంగా ఉంటుంది. త్రైయ్‌నెర కెనోయ్‌ల మీద సాగే ప్రయాణంలో చక్కటి మారియాచ్చి శైలి సంగీతం వినిపిస్తారు. కెనోయ్‌లకు చిక్కటి రంగులను అద్ది ముస్తాబుచేస్తారు. ఇదే పొట్ట నింపే జీవనాధారం మరి.

వాచ్చీలే ...వచ్చాయిలా...

పనికిరాని వాటిని...పని చేయబోమని మొరాయించిన వాటిని ... అవతల పడేస్తుంటాం. అయితే వాటి నుంచి కూడా అందమైన ఆకృతులు రూపొందించవచ్చని నిరూపించింది సూ బియాట్రైస్. పనిచేయని గడియారాలను తన ముడిసరకుగా ఎంచుకుంది. ఆమె చేతి స్పర్శతో వాచ్చీల విడిభాగాలు కుందేళ్లు, గుర్రాలు, తేనెటీగలు, కోతులు, నక్కలు, పులులు, కథల్లో కన్పించే దేవతల... రూపంలో మన చేతిలో చేరిపోతాయి. వాటిని చూసినవారెవరైనా సరే ... 'ఆ పనికి రాని వాచ్చీల నుంచి ఇంత అందమైన ఆకృతులను చేసిందా?' అని ఆశ్చర్యపోక మానరు. అంతటి సృజనను సొంతం చేసుకున్న సూ బియాట్రైస్ న్యూజెర్సీకి చెందిన చిత్రకారిణి, సైకత శిల్పి, రచయిత్రి, బహుముఖ ప్రజ్ఞను సొంతం చేసుకున్న ఆమెలో చిన్నతనం నుంచి కళా దృష్టి మెండుగా వుండేది. పదేళ్ల వయసులోనే రాళ్ల మీద రంగులతో బొమ్మలు వేసి తోటి వారిలో ప్రత్యేకతను చాటుకునేది. ఆ తర్వాత ఆక్రిలిక్ పెయింట్లతో బొమ్మలు వేయడం మొదలెట్టింది. గత కొంతకాలంగా ఇదిగో ఇలా వాచ్చీలతో కళాఖండాలు సృజించి ... ఎగ్జిబిషన్లలో ప్రదర్శించి ప్రపంచ వ్యాప్తంగా అభిమానులను సంపాదించుకొంది. ఇలాంటివి చూసినప్పుడే... 'సృజనాత్మకత వుండాలే కానీ... కాదా లోకం దాసోహం' అనిపిస్తుంది.

•